

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

**వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు.. జనసేన కండువా కప్పిన పవన్**



ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 255 | మంగళవారం 22 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3



# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

**కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి**

**సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా**

**త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక** 2లో

**వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం.

# టీచర్లపై దాడి

## నిందితులను వదిలిపెట్టం..





**స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం** 2లో

**దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక**

**దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ**

**రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ**

**ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు**

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై

## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

## తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్



**విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం**

**తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన**

**ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం,**

**రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక**

**గురువులపై దాడులను సహించబోమని,**

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ**

**ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి** 2లో

విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?** మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ గోడు

## రూ.40 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా చేశారంటూ రిజిస్ట్రేషన్ డీజీ ఆఫీస్ ఎదుట జేసీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన

**తాడిపత్రిలో వైసీపీ నేతలు భూ కబ్జా చేశారన్న జేసీ ప్రభాకర్ రెడ్డి**

**ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు విఫలమయ్యారని మండిపాటు**

**పెద్దారెడ్డి కూడా 2 సెంట్ల భూమి కబ్జా చేశారని ఆరోపణ** 2లో



# చెరువులకు కొత్తజీవం

**పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన**

**ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం** 2లో

**పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ**

**గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక**

**రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి**



## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్

**జూరాల ప్రాజెక్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్**

**జూరాల ప్రాజెక్ట్ ముట్టడికి బీఆర్ఎస్ పిలుపు**

**బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్న పోలీసులు** 2లో



# రామ మందిరంలో భారీ కుంభకోణం:

**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం**

**ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్** 2లో

**సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు**

**ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు**



## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన

# కూటమి ప్రభుత్వం

**ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు**

**ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల**

**పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు**

**ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం**

**2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి** 2లో

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా)

# చెరువులకు కొత్తజీవం

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ** ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (ఫ్రవీఖ్) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టు ముట్టడి పిలుపు జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున రంగంలోకి దిగి ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహనిర్బంధం చేశారు. ముట్టడి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇంటెలిజెన్స్ బలగాలను మోహరించి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల దిగ్బంధంతో జూరాల ఆనకట్ట పరిసరాలు, క్షేత్రస్థాయి ప్రాంతాలు పూర్తిగా వ్యూహాత్మక బలగాల మోహరింపుతో నిండిపోయాయి. వనపర్తి, ఆత్మకూరు, అమరచింత, నర్వ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వైపు రాకుండా రహదారుల వెంట వాహన తనిఖీలు చేపట్టారు. మరోవైపు గద్వాలలోనూ కాలువలకు నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం, రైతు సంఘాలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో అక్కడ కూడా నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ముట్టడి పిలుపు, పోలీసుల కట్టుదిట్టమైన ఆంక్షల నడుమ జూరాల ప్రాజెక్ట్ సమీపంలో హైటెన్షన్ వాతావరణం కొనసాగుతోంది.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరం వైపు దూసుకొస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ఈ వాయుగుండం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం ఈ వాయుగుండం ఒడిశాలోని పూరీకి ఆగ్నేయంగా 310 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నానికి 390 కిలోమీటర్లు, విశాఖపట్నానికి తూర్పున 470 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత కూడా ఇదే దిశలో కదులుతూ సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి నుంచి 24వ తేదీ తెల్లవారుజాము మధ్యలో తీవ్ర వాయుగుండంగానే ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాలను దాటుతుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గోపాల్‌పూర్ మధ్య ఇది తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరప్రాంతాల అధికారులు అప్రమత్తమయ్యారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

## ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలు: గెలిచే ఛాన్స్ అలా చేజార్చుకున్న కాంగ్రెస్!

ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేకపోయిన ఎన్ఎస్‌యూఐకి ఏబీవీపీ రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఏబీవీపీ మూడు కీలక స్థానాలను కైవసం చేసుకోగా, ఎన్ఎస్‌యూఐ టికెట్ నిరాకరించిన ఒక రెబల్ అభ్యర్థి ఉపాధ్యక్ష పదవిని భారీ మెజారిటీతో గెలుచుకోవడం గమనార్హం. టికెట్ల కేటాయింపులో నాయకత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయమే ఈ పరాజయానికి దారితీసిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేయడంలో రెండు నిర్ణయాలు ప్రధాన పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. తొలుత అధ్యక్ష అభ్యర్థిగా భావించిన దీపాంశు షోకీన్‌ను చివరి నిమిషంలో పక్కన పెట్టడం ఎన్ఎస్‌యూఐ చేసిన అతిపెద్ద తప్పిదంగా మారింది. ఏబీవీపీ అభ్యర్థి కూడా జాట్ వర్గానికి చెందిన నేత కావడంతో ఓట్లు చీలకుండా ఉండేందుకు, తాను అధ్యక్ష పదవికి బదులుగా ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తానని షోకీన్ ప్రతిపాదించారు. అయితే, ఎన్ఎస్‌యూఐ ఇన్‌ఛార్జ్ కన్హయ కుమార్ దీనిని క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించి, అతడిని ప్యానెల్ నుంచి తొలగించారు. షోకీన్ స్థానంలో విజయ్ శంకర్ మీనాను అధ్యక్ష బరిలోకి దించిన పార్టీ, ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ ఛత్రత్ కుమారుడు వీర్ ఛత్రత్‌కు టికెట్ ఇచ్చింది. షోకీన్ నిష్క్రమణతో చేజారుతున్న జాట్ సామాజిక వర్గ ఓట్లను కాపాడుకునేందుకు, జాయింట్ సెక్రటరీ అభ్యర్థిగా ఉన్న విశేష్ యాదవ్‌ను మార్చి అతని స్థానంలో గోపాల్ చౌదరిని నిలబెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన విశేష్ యాదవ్ సైతం రెబల్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఎన్నికల ఫలితాల్లో ఈ పరిణామాలు స్పష్టమైన ప్రభావాన్ని చూపాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దీపాంశు షోకీన్ ఏకంగా 13,000 ఓట్లకు పైగా భారీ మెజారిటీతో ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు.

## ప్రజా దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలి

### పిజిఆర్ఎస్‌కు 362 దరఖాస్తులు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 21(నంది పత్రిక):-** ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా 362 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అధికారుల పిజిఆర్ఎస్ లాగిన్‌లలో ఇప్పటివరకు పరిశీలించని 135 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే ఓపెన్ చేసి పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఏ దరఖాస్తు కూడా ఎట్ టు వ్యూ స్థాయిలో పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో ఇంకా 13 అర్జీలు పరిష్కరించాల్సి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారికి సమర్పించిన దరఖాస్తుల్లో ఒక అర్జీ ఇంకా పెండింగ్‌లో ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, ప్రతి అర్జీపై తీసుకున్న చర్యలను పిజిఆర్ఎస్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 170 అర్జీల స్వీకరణ** రెవెన్యూ క్లినిక్స్ ద్వారా జిల్లాలో మొత్తం 170 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 6, అడంగల్ సవరణలకు 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించి 11, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 41, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 40, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 46, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 2 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా అందిన కొన్ని దరఖాస్తులు** 1)ఆత్మకూరు మండలం శ్రీరామనగర్, కప్పలగుంటకు చెందిన కళావతి తన ఆస్తి పన్ను, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఈసీ ఆధారంగా తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను మున్సిపాలిటీ పొరపాటున మరో వ్యక్తికి కేటాయించిందని, తనకు కేటాయించిన డోర్ నంబర్‌ను తిరిగి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. 2)మిడ్తూరు మండలం వీపనగండ్లకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వేల్పుల మాణిక్యరావు, తన తల్లి పేరుతో వీపనగండ్ల గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 14లో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నందున, నిబంధనల మేరకు నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. 3)నందికొట్కూరు మండలం: విద్యపోగు లక్ష్మీదేవి తన భర్త మరణించడంతో జీవనోపాధి కష్టంగా మారిందని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జెడ్పీ కార్యకలాపాలకు నంద్యాలలో తాత్కాలిక కార్యాలయ ఏర్పాట్లు

### అనువైన భవనం, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 21(నంది పత్రిక):-** జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యకలాపాలను నంద్యాల నుంచే సజావుగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాలయ వసతులను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుత జెడ్పీ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబరు 24తో ముగియనుండగా, సెప్టెంబరు 25 నుంచి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించనున్న నేపథ్యంలో జెడ్పీ కార్యాలయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జెడ్పీ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు నంద్యాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలు, వసతులను జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆడిట్ కార్యాలయ ప్రాంగణాల్లో అందుబాటులో ఉన్న గదులు, కార్యాలయ నిర్వహణకు అనువైన వసతులు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. నూతన జెడ్పీ భవనం అందుబాటులోకి వచ్చే వరకు అనువైన తాత్కాలిక భవనంలో కార్యాలయ కార్యకలాపాలు సజావుగా కొనసాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 25 నుంచి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో జెడ్పీ కార్యకలాపాలు కొనసాగనున్న నేపథ్యంలో డిప్యూటీ సీఈఓ, అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు సుమారు 50 మంది సిబ్బంది కర్నూలు నుంచి నంద్యాలకు రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన కార్యాలయ గదులు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలను సమకూర్చేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం:

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు** కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం** "2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగానూ కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత.. టీచర్లు వర్సెస్ వైసీపీ..

వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు** వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## రామ మందిరంలో భారీ కుంభకోణం:

అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రాదీ×) లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## రూ.40 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా చేశారంటూ రిజిస్ట్రేషన్ డీజీ ఆఫీస్ ఎదుట జేసీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన

అనంతపురం జిల్లా తాడిపత్రిలో సుమారు రూ. 40 కోట్ల విలువైన విలువైన ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు అక్రమంగా కాజేశారని టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీజీ కార్యాలయం ఎదుట ఆయన ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ బసవరాజు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని, ఆయనతో పాటు దీనికి సహకరించిన బాధ్యులైన అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గత ప్రభుత్వ హయాంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా 2 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఇల్లు నిర్మించుకున్నారని, ఆధారాలున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ భూ వివాదం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిపి డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, వీఆర్ఓ వెంకటస్వామితో పాటు జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ షఫీలను సస్పెండ్ చేస్తూ సంచలన ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

## యూపీఐ ఛార్జీలు వద్దు.. కేంద్రానికి మొబైల్ రిటైలర్ల విజ్ఞప్తి

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదిత మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదా ఇతర అదనపు ఛార్జీల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ (ఏఐఎంఆర్ఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పటికే అత్యల్ప లాభాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, ఈ అదనపు భారం తమ మనుగడను దెబ్బతీస్తుందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏఐఎంఆర్ఏ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మందికి పైగా చిన్న, మధ్య తరహా మొబైల్, ఎలక్ట్రానిక్స్ రిటైలర్లకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అసోసియేషన్ తెలిపింది. తాము కేవలం 0.75% నుంచి 1.5% నికర లాభాలతో వ్యాపారాలు సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో యూపీఐ లావాదేవీలపై 0.4% ఎండీఆర్ విధిస్తే అది నేరుగా తమ లాభాలను హరిస్తుందని పేర్కొంది.

22 మంగళవారం సెప్టెంబర్ 2026

# వై.ఎస్. జగన్ క్రైస్తవం స్వీకరించాలని ఏ ఒక్కరినీ కోరలేదంటూనే కాలకూట విషం.

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీజేపీ తోనే అంటూ వెన్నుదన్ను.**

**వై.ఎస్ జగన్ ను హిందూ వ్యతిరేకిగా,ప్రధాని మోడికి దూరం చేయాలన్న లక్ష్యంతో నే కుట్ర.**

**కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి మాట్లాడాక కూడా వై.ఎస్.జగన్ పై విషం చిమ్మడం ఏమిటీ?**

**కొత్త పలుకు ఆర్కే విశ్లేషణపై వైయస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం పైర్.**

**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 21( చాపాడు )** వైఎస్సార్ సిపీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ క్రైస్తవం స్వీకరించాలని ఏ ఒక్కరినీ కోరలేదంటూనే... తన సంపాదనలో పది శాతాన్ని చర్చీల అభివృద్ధి పేరట కేటాయిస్తున్నారంటూ కట్టు కథలు,పిట్టకథలు చెబుతూ వై.ఎస్. జగన్ ను హిందూ వ్యతిరేకిగా... క్రైస్తవ పక్షపాతిగా చిత్రీకరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి దూరం చేసేందుకు కొత్త పలుకులు ఆర్కే విశ్లేషణ పేరుతో డ్రామాలాడుతూ,కాలకూట విషం చిమ్ముతూ, వితండవాదంతో కుట్రకు తెరతీయడం ఆర్కే మార్క్ నీచ రాజకీయమని వైస్సార్ సిపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. చాపాడు లో ఆదివారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్,తెలంగాణాలో క్రైస్తవం లోకి మారినవారు ఆయా రాష్ట్రాల్లో ఓటు బ్యాంకు గా మారుతుండడశీతో కేంద్ర ప్రభుత్వ పెద్దలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారంటూ కల్పిత కథలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి మేలు జరిగే విదంగా వితండ వాదం చేయడం పై ఆయన మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్ లో మత మార్పిడి అనేది ఒక ఉద్యమంలా సాగుతోందని ... ఉమ్మడి ఏపిలో ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఉన్నప్పుడు సైలెంట్ గా మొదలైన మత మార్పిడులు, వై.ఎస్. జగన్ రాజకీయ అరంగేట్రం తర్వాత ఉద్యమంలా ఊపందుకుందంటూనే.... వై.ఎస్ జగన్ క్రైస్తవం స్వీకరించాలని ఏ ఒక్కరినీ కోరలేదంటూ ఆర్కే చెప్పడం ద్వందనీతి,రెండు నాల్కల దోరణి కాదా?అని ఆయన నిలదీశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా చివరి వరకు బీజేపీతో కలసి నడవాలనుకుంటున్నందున కూటమి ఐక్యతకు ముప్పు లేదంటూ ఏ ఆధారాలతో ఆర్కే విశ్లేషిస్తారని... నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గత ఎన్నికల్లో చంద్రబాబు చిమ్మిన విషం,గ్లోబెల్స్ ప్రచారం గతంలో ఏనాడైనా జరిగిందా?అంటూ సూటిగా ప్రశ్నించారు. ఎన్నోసార్లు మోడీకి అనుకూలంగా,వ్యతిరేకంగా వ్యవహరించిన ... టి.డి.పి కి వ్యతిరేకంగా పుట్టిన కాంగ్రెస్ తో సైతం అంటి కాగిన చంద్రబాబు చివరి వరకు బిజెపితో నడవాలనుకుంటున్నారంటూ అసత్య,నిరాధార విశ్లేషణను ఆర్కే ఎలా రాస్తారని ఆయన విరుచుకుపడ్డారు.వై.ఎస్.జగన్ క్రైస్తవ ఓటు బ్యాంకు కోసంపట్టుదలతో ప్రయత్నిస్తున్నారంటూ ఆర్కే ఎలా విశ్లేషిస్తారని... దమ్ముంటె దీనికి ఆధారాలు చూపాలని ఆయన సవాల్ విసిరారు. వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి తాను క్రైస్తవుడుగా ఏనాడూ ప్రచారం చేసుకోలేదంటూనే.... వైఎస్ఆర్ క్రైస్తవుడనే విషయము చాలా మందికి తెలియదంటూనే, వైయస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైలెంట్ గా మత మార్పిడులు మొదలయ్యాయనటం సిగ్గు చేటన్నారు.మెడలో శిలువ వేసుకుని



వై.ఎస్. జగన్ దృష్టిలో పడితే ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కించుకోవడం, పదవులు దక్కించుకోవడం సులువవుతుందని ఆర్కే విశ్లేషణలో పసలేదన్నారు.అదే నిజమైతే రాజంపేట వైయస్సార్ సీపీ శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి సంవత్సరంలో అతి ఎక్కువ రోజులు హిందూ దేవుళ్ళకు సంబందించి మాలలు వేస్తారని,దుస్తులు దరిస్తారని మరి ఆకేపాటికి మించిన నమ్మకస్తుడు వై.ఎస్.జగన్ కు ఉన్నారా?అని ఆయన ప్రశ్నించారు.తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తో వై.ఎస్.జగన్ ను ముడిపెడుతూ ఆర్కే విశ్లేషణ మోకాటికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుందని ఆయన ఎద్దేవా చేశారు. 2024 జనవరిలో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిదిలో జరిగిన "వేద విద్వత్ సదస్సులో " మత మార్పిడులు జరగకుండా, వేలాది హిందూ దేవాలయాలు నిర్మించి,హిందూ మత వ్యాప్తికి వై.ఎస్.జగన్ విశేషంగా కృషిచేశారని... వై.ఎస్. జగన్ పాలనలో జరిగినంత హిందూ మత వ్యాప్తి ఇంతకుమునుపెన్నడూ జరగలేదని కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి చెప్పాక కూడా వై. ఎస్ జగన్ ను హిందూ వ్యతిరేకి గా చిత్రీకరించేందుకు ఆర్కే సాహసించడం ఆకాశంపై ఉమ్మివేయడంలాంటిదేనని రెడ్యం విశ్లేషించారు.

## శ్రీరాములపేట గ్రామంలో "సేవా సంకల్ప అభియాన్"వైద్యశిబిరం.



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 21** చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెద్ద గురువలూరు సచివాలయ పరిధిలో శ్రీరాములుపేట గ్రామంలో డాక్టర్ పి.ఓబులేసు ఆధ్వర్యంలో జరిగిన" సేవా సంకల్ప అభియాన్ "కార్యక్రమం విజయవంతం చేసినట్లు నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలియజేశారు ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ ముఖ్యంగా ఈ వైద్య శిబిరంలో గర్భవతులు, బాలింతలు, మధుమేహం, రక్తపోటు, మరియు మధుమేహం,రక్తపోటు, రెండు ఉన్నవారు, బ్రెయిన్ స్ట్రోక్ చరిత్ర, గుండె సంబంధిత వ్యాధులున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహిచి అవసరమైన వైద్య సలహాలు చికిత్సలు అందించారనీ తెలిపారు.అదే విధంగా కుష్టు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహించారు.గర్భిణీలకు మరియు ఇతర రోగులకు పోషకాహారం,ఆరోగ్యకరమైన జీవనశైలి,వ్యాధుల నియంత్రణ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం తదితర అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారనీ డాక్టర్ ఓబులేసు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని ముందస్తుగా గుర్తించి నియంత్రించడం, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ పి.ఓబులేసు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య,సూపర్ వైజర్ ప్రసాద్,యం ఎల్ హెచ్ పి నీలావతి,ఎ ఎన్ యం శశిరాణి, ఆశా కార్యకర్తలు పెద్ద ఒబులమ్మ, గౌరీ దేవి,104 వాహన సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (ాబఎశ్రీఅఎ +తీఅవఝుఅఎవ =వఎతీవంయిశ్రీ ాఎర్వఎ -ా+=ా) లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించడం సాధ్యం కాని పరిస్థితుల్లో, కారణాలను పూర్తిగా వివరించి పిటిషనర్లకు అవగాహన కల్పించాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోని, ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న "రీ ఓపెన్" మరియు "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, అనురాధ, శివప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పై అవగాహన



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 21:** ఈనెల 25న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైద్యాధికారులు సవిత భావన రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు ఎమ్ ఎల్ హెచ్ పి లకు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకటి నుండి 19 సంవత్సరముల వయసులోపు కలిగిన పిల్లలందరికీ నాలుగువందల మిల్లీగ్రాముల ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని వైద్యాధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రవికుమార్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీల ఆస్తులు కబ్జా చేస్తారా? కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి తీవ్ర ధ్వజం




**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 21 ( నంది పత్రిక )** "అధికారంలోకి వస్తే వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామని మాయమాటలు చెప్పిన కూటమి నేతలు, నేడు మైనార్టీల స్థలాలను ప్రభుత్వానికి ధారాదత్తం చేయడం ఘోరాతిఘోరం. స్వయంగా ప్రభుత్వమే మైనార్టీల హక్కులు, స్థలాలను కబ్జా చేసే దుస్థితికి దిగజారింది" అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల పట్టణంలో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎస్డీపీఐ (ాణూ×) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి శిల్పా రవిరెడ్డి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాతో కలిసి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శిల్పా రవిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్సీపీ హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమం, విద్య కోసం ఎంతో కృషి చేశారు. అందులో భాగంగానే నంద్యాలలో ఉర్దూ కళాశాల వసతిగృహం భవనాలను నిర్మిస్తే, ఈ కూటమి ప్రభుత్వం వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించుకోవాలని చూడటం దారుణం అన్నారు. వక్ఫ్ బోర్డు, మైనార్టీల స్థలాలను కేవలం వారి అభ్యున్నతికే ఉపయోగించాలి తప్ప ప్రభుత్వ అవసరాలకు వాడరాదన్నారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్లు కాస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు, కొత్త పెన్షన్ల ఊసే లేదు. రైతులకు 'రైతు భరోసా' ఎగ్గొట్టి వారిని రోడ్డున పడేసిన దౌర్భాగ్య ప్రభుత్వం అని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీల హక్కులను కాలరాస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఈ కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బాధితులు, ప్రజాసంఘాలు చేసే ప్రతీ పోరాటానికి వైఎస్సార్సీపీ వెన్నుముకగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్రఎస్టీ సెల్ కార్యదర్శి ఆంజనేయులు మాజీ కౌన్సిలర్ తమిమ్, మాజీ కౌన్సిలర్లు వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## అంధ బాలిక కుటుంబానికి ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం చేయూత



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 21** ఖాజీపేట, వైఎస్ఆర్ కడప జిల్లా: ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పుల్లూరు పంచాయతీ పరిధిలోని పత్తూరు గ్రామం బేస్తకాలనీకి చెందిన సుంకు శివయ్య కుమార్తె గంగాదేవి అనే అంధ, వికలాంగ బాలిక కుటుంబానికి ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులను అందించారు. సేవా కార్యక్రమానికి సహకరించిన ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులకు బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ హాజీ గౌస్, సలహాదారు షేక్ అల్లా బకాష్, ఈసీ సభ్యులు షేక్ మొహమ్మద్ హుస్సేన్, షేక్ గౌస్ లాజం, పెద్దాయన నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## డోన్ మునిసిపల్ ఎన్నికల ఫైనల్ పబ్లికేషన్ విడుదల



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 21** డోన్ మునిసిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లకు సంబంధించిన తుది (ఫైనల్) పబ్లికేషన్‌ను సోమవారం విడుదల చేశారు. మునిసిపల్ కమిషనర్ కె. నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజర్వేషన్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లకు సంబంధించిన తుది పబ్లికేషన్‌ను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తదుపరి ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు గారి జయంతి వేడుకలు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 21** వైయస్సార్ కడప జిల్లా- ఖాజీపేట బస్టాండులో సూక్ష్మ నిర్మాణాల కళాకారులు, కవి షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 21 సెప్టెంబర్ 1862 రాయవరం, విశాఖపట్నం ప్రాంతంలో జన్మించారు. సమాజంలో మూఢనమ్మకాలు, దురాచారాలను తన రచనల ద్వారా కడిగిపారేసిన మహానీయుడు గురజాడ అని వక్తలు కొనియాడారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ ఆయన అందించిన సందేశం ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. బాల్య వివాహం, కన్యాశుల్కం, కపట సాంప్రదాయాలు వంటి సామాజిక సమస్యలను వ్యంగ్యంగా చూపించిన ప్రసిద్ధ రచన తెలుగు నాటకం. తెలుగు రచనల్లో వ్యావహారిక భాష ఉపయోగాన్ని ప్రోత్సహించారు. స్త్రీల స్థితి కుల వివక్ష మూఢనమ్మకాలు సామాజిక అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నలు లేవనెత్తారు. ఈరోజు తెలుగు నవయుగ వైతాళికుడు, అభ్యుదయ కవి, రచయిత, నాటక కర్త, సామాజిక సంస్కర్త మహాకవి గురజాడ అప్పారావు 164 వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించినాము. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించాము. ఈ కార్యక్రమంలో రచయిత షేక్ ఇంతియాజుద్దీన్, ఓబుల్ రెడ్డి, సాలయ్య, ఈ మొహమ్మద్ హుస్సేన్, బొమ్మలయ్య, లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొని గురజాడ సేవలను స్మరించుకున్నారు.

## అంధ బాలిక కుటుంబానికి ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం చేయూత



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 21** ఖాజీపేట, వైఎస్ఆర్ కడప జిల్లా: ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పుల్లూరు పంచాయతీ పరిధిలోని పత్తూరు గ్రామం బేస్తకాలనీకి చెందిన సుంకు శివయ్య కుమార్తె గంగాదేవి అనే అంధ, వికలాంగ బాలిక కుటుంబానికి ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులను అందించారు. సేవా కార్యక్రమానికి సహకరించిన ఖాజీపేట ఫ్రెండ్స్ సేవా సంఘం సభ్యులకు బాలిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ హాజీ గౌస్, సలహాదారు షేక్ అల్లా బకాష్, ఈసీ సభ్యులు షేక్ మొహమ్మద్ హుస్సేన్, షేక్ గౌస్ లాజం, పెద్దాయన నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎంపిక



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 21 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం బాబా నగర్ శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి పి.సాయికుమార్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణ నందు నిర్వహించిన సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నందు పి .సాయికుమార్ పదో తరగతి విద్యార్థి స్టేట్ లెవెల్ లో అత్యున్నత ప్రతిభను కనబరిచి నేషనల్ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు అక్టోబర్ 5వ తేదీన చత్తీస్గడ్ పట్టణం నందు నిర్వహించే నేషనల్ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నందు పాల్గొంటారని తెలిపారు సందర్భంగా సాయికుమార్ ను మరియు విద్యార్థి విజయానికి చక్కని శిక్షణ అందించిన బాల్ బ్యాడ్మింటన్ కోచ్ డి పి రాజు గారిని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్య తో పాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

# గణేష్ నిమజ్జన విజయవంతానికి సహకరించాలి

## మూడు ఘాట్లలో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి

## కేసీ కెనాల్ వద్ద 5 అడుగుల విగ్రహాలకే అనుమతి

## నిమజ్జనానికి 15 క్రేన్లు, ప్రత్యేక లైటింగ్

## పూజా సామగ్రిని మండపాల వద్దే వదిలేయాలి



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో నాలుగు దశాబ్దాలుగా అత్యంత వైభవంగా కొనసాగుతున్న గణనాథుని నిమజ్జనానికి ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నిమజ్జనం విజయవంతంగా జరిగేందుకు భక్తులు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. సోమవారం ఆయన కేసీ కెనాల్ వినాయక ఘాట్, నన్నూరు టోల్ ప్లాజా, ఉలిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ తీరంలో ఏర్పాటు చేసిన ఘాట్‌లను పరిశీలించారు. అనంతరం వినాయక ఘాట్ వద్ద గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కార్యాలయంలో కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడు ఘాట్ల వద్ద 15 క్రేన్లు, ప్రత్యేక లైటింగ్, మైకులు, మెటల్ రోడ్లు, రంగులు తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్‌ను మూడు నెలల క్రితమే ప్రత్యేకంగా అభివృద్ధి చేసి, జేసీబీలతో చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు సీసీ రహదారి, మెట్లు, బండ్, డ్రెయిన్, రాతి నిర్మాణాలు, ఫెన్సింగ్ వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు డస్ట్‌బిన్లు, చెత్త సేకరణ ట్రాలీలతో పాటు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది కేసీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో 600 మీటర్ల పొడవున ట్యాంకు తరహాలో గోడలు నిర్మించి, అశోక్ నగర్ పంప్‌హౌస్ నుంచి వెలువడే వాష్ వాటర్‌ను వినాయక ఘాట్‌కు తరలించినట్లు కమిషనర్ తెలిపారు. నీటి ప్రవాహం పరిమితంగా ఉన్నందున కేసీ కెనాల్ వద్ద 5 అడుగులలోపు విగ్రహాలకే నిమజ్జనానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. 5 అడుగులకు పైగా ఉన్న విగ్రహాల కోసం నన్నూరు టోల్ ప్లాజా సమీపంలో, ఉలిందకొండ వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ తీరంలో రెండు ప్రత్యామ్నాయ నిమజ్జన ఘాట్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినాయక విగ్రహాలతో పాటు పూల దండలు, పులిహోరాలు, ఇతర పూజా సామగ్రిని తీసుకురాకుండా మండపాల వద్దే వదిలేయాలని కమిషనర్ కోరారు. నిమజ్జనం కోసం విగ్రహాన్ని మాత్రమే తీసుకురావాలని, పూజా సామగ్రిని తీసుకొస్తే ఘాట్ వద్ద సిబ్బంది వాటిని తొలగిస్తారని తెలిపారు. చిన్న పిల్లలను క్రేన్లు, నిమజ్జన ప్రాంతాల వద్దకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సజావుగా జరిగేందుకు అధికార యంత్రాంగానికి భక్తులు, నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కమిషనర్ కోరారు.

# నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేయాలి

## ప్రభుత్వ శాఖలో ఖాళీగ ఉన్న పోస్టులను భర్తీ చేయాలి: ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్.




**కర్నూలు సిటీ నంది పత్రిక** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కర్నూలు జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ జీ. సంతోష్ కుమార్, మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ లెనిన్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతోందని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఉద్యోగ నియామకాలు జరగలేదన్నారు. పోలీస్ శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ పరిమిత సంఖ్యలో మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులన్నింటినీ గుర్తించి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, ముఖ్యంగా గంజాయి ప్రభావం నుంచి యువతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజా సంఘాలపై ఉందన్నారు. సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్టాప్ డ్రగ్స్, స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం, అవగాహన సదస్సులు, సేవా కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల బారిన పడుతున్న యువతను కాపాడి, వారిని క్రీడలు, విద్య, ఉపాధి వైపు నడిపించడమే లక్ష్యంగా ఏఐవైఎఫ్ పనిచేస్తుందని తెలిపారు. భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువతలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు ఈ వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ పిలుపునిచ్చింది.

# బండి ఆత్మకూరులో ఆరవ రోజుకు చేరుకున్న వీఆర్ఏల సమ్మె



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 21:** తమ డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె విరమించబోమని వీఆర్ఏలు స్పష్టం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 16వ తేదీ నుండి వీఆర్ఏలు చేస్తున్న సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట కడమల కాల్వ, ఈర్నపాడు, ఏ కోడూరు, బి కోడూరు, రామాపురం, సింగవరం గ్రామాలకు చెందిన వీఆర్ఏలు సమ్మె చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ తెలంగాణ తరహాలో వీఆర్ఏలకు పేస్కేలు వర్తింపజేయాలని అర్హులైన వీఆర్ఏల అందరికీ వన్ టైం సెటిల్మెంట్ కింద వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వీఆర్ఏల స్థానంలో వైశ్య తో సంబంధం లేకుండా వారి నామినీలను వీఆర్వోలుగా నియమించాలని డిమాండ్ చేశారు. వాచ్మెన్లు, అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్ పోస్టులను ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని జారీ చేసిన జీవో నెంబర్ 42 రద్దుచేసి అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఎలాంటి పరిస్థితులలోనూ సమ్మె విరమించ బోమని డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న వీఆర్ఏలకు ప్రతిపక్ష నాయకులు ఎవరు మద్దతు తెలపకపోవడం విచారకరం.

# ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడికి ఇంటి పట్టా ఇవ్వాలి...... సిపిఐ




**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం 11 గంటలకు కలెక్టర్ ఆఫీస్ ముందర మానవహారంగా ఏర్పడి ధర్నా నిర్వహించడం జరిగినది ఈ ధర్నా కార్యక్రమానికి సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ కే జగన్నాథం నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో గత ఆరు సంవత్సరాలుగా దాదాపు 1500 వందల కుటుంబాలు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు వారందరి తరపున సిపిఐ ఆధ్వర్యంలో గతంలో ప్రభుత్వ అధికారులు దృష్టికి మరియు మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగినది అయినప్పటికీ ఇంటి పట్టాల సమస్య పరిష్కారం కాలేదు ఇప్పటికైనా అధికారుల స్పందించి నివాసముంటున్న ప్రతి పేదవాడికి ఇంటి పట్టా ఇవ్వాలని లేని పక్షంలో దశలవారీగా ఆందోళనకు పునుక్కుంటామని కలెక్టర్ ఆఫీసు ముట్టడి చేస్తామని హెచ్చరించారు ఎన్నికల ముందర చంద్రబాబునాయుడు పట్టణ ప్రాంతంలోని ప్రతి పేదవాడికి రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తాను ఆ రెండు సెంట్లలో ఇల్లు నిర్మించుకోవడానికి సరిపడా డబ్బులు ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో గెలిచి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటిదాకా రాష్ట్ర వ్యాప్తంగా ఒక పేదవాడికి కూడా రెండు సెంట్ల స్థలం ఇచ్చిన దాఖలాలు లేదని స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా మొన్నటి రోజున విశాఖపట్నంలో 8874 వందల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను పేదలకు పట్టాలు ఇస్తున్నామని విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో పెద్ద సభ పెట్టి గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి కర్నూల్లో కూడా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని గత ఆరు సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు మరి మీకు కనపడడం లేద అని వారన్నారు ఎన్నికల మోసపూరిత వాగ్దానాలు కాకుండా పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దానికోసం ప్రభుత్వాలు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు అనంతరం పి జి ఆర్ ఎస్ లో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాసులు నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు బిసన్న అన్వర్ గిడ్డమ్మ వెంకటేష్ చింతల కుమార్ అశోక్ భద్ర కుమార్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి రంగస్వామి రైతు సంఘం నాయకులు రాముడు మహిళా సంఘం ధనలక్ష్మి రబియా ఆశా బేగం సులోచనమ్మ సయ్యద్ బాషా అశోకు రామాంజి కరీమున్నీ మరియు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 26న ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో 629 మంది ట్రైనీ పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్

**ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో 430 మంది, డీటీసీ కర్నూలులో 199 మంది ట్రైనీ పోలీసులకు కలిపి పాసింగ్ ఔట్ పరేడ్.**

**పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి...**

**ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** సెప్టెంబర్ 26వ తేదీ (శనివారం) స్థానిక ఏపీఎస్పీ 2వ బెటాలియన్ మైదానంలో మొత్తం 629 మంది ట్రైనీ పోలీసులకు కలిపి పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఏపీఎస్పీ 2వ బెటాలియన్‌లో శిక్షణ పొందిన 430 మంది, కర్నూలు డీటీసీలో శిక్షణ పొందిన 199 మంది ట్రైనీ పోలీసులు శిక్షణ పూర్తి చేసుకొని, మొత్తం 629 మంది ట్రైనీ పోలీసులకు ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ మైదానంలో కలిపి పాసింగ్ ఔట్ పరేడ్‌నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఐఏఎస్, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాసింగ్ ఔట్ పరేడ్ ఏర్పాట్లపై అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చి దిశానిర్దేశం చేశారు. పరేడ్ మైదానంలో నియమ నిబంధనలను పక్కాగా పాటించాలని, అన్ని విభాగాల పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. శిక్షణ కాలంలో ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ ఔట్ డోర్, బెస్ట్ ఇండోర్, బెస్ట్ ఓవరాల్, బెస్ట్ ఫైరింగ్, బెస్ట్ పరేడ్ కమాండర్, బెస్ట్ ఇన్‌స్ట్రక్టర్ తదితర విభాగాల్లో పోలీసులకు అవార్డులు అందజేయనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ట్రైనీ కుటుంబం నుంచి ఇద్దరికి మాత్రమే గ్యాలరీలోకి అనుమతి ఉంటుంది. ఇందుకోసం ప్రతి ట్రైనీకి రెండేసి పాసులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, పాసులు ఉన్నవారిని మాత్రమే గ్యాలరీలోకి అనుమతించాలని సూచించారు. అతిథులు, కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా 1,400 సీట్లతో పండాల్స్, కుర్చీలు, పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మైదానంలో భద్రతా నియమాలను పకడ్బందీగా పాటించాలని, వచ్చే వాహనాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్టమైన పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, అడిషనల్ కమాండెంట్ నాగేంద్రరావు, అసిస్టెంట్ కమాండెంట్లు వెంకటరమణ, బాషా, వెంకటశివుడు, డిటిసి వైస్ ప్రిన్సిప్రాల్ దుర్గాప్రసాద్, డిఎస్పీలు ఓబులేసు, సుధాకర్ రెడ్డి, సీఐలు విక్రమసింహ, వెంకటకృష్ణారెడ్డి ఆర్ఐ లు జావేద్, నారాయణ , ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఉలిందకొండలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

## నిరసన దీక్షలను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన నిరసన దీక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయిన ఇంకా గ్రామాల్లో తాగునీటి సమస్య కోసం రోడ్లు ఎక్కే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గ్రామానికి త్రాగునీరు అందించడంలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తీవ్రంగా విఫలమయ్యారని అన్నారు. వారానికి ఒకరోజు నీళ్లు వస్తున్న పట్టించుకోవడం లేదని పురుగులు పడిన నీళ్లు తాగి ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలు అవుతున్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే ఉలిందకొండ గ్రామం అత్యధిక మెజారిటీ ఇచ్చిందని గొప్పలు చెబుతున్నారు. సిపిఎం పార్టీగా మేము ప్రశ్నిస్తున్నాం అత్యధిక మెజారిటీ ఇచ్చిన గ్రామానికి మీరు ఏమి ఇచ్చారు. నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడితే మీరు ఏం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కరించాలి అన్నారు దీక్షల చివరి రోజున గ్రామంలోని ప్రజలందరినీ ఐక్యం చేసి రోడ్డు దిగ్బంధన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు కె మధు, ఎస్ రాజు, బీచుపల్లి, రమణ, గొల్ల మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి గురజాడ అప్పారావు సాహిత్య సేవలు చిరస్మరణీయం. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు.



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక:** మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ మల్లికార్జునుడు, జ్యోతి ప్రజ్వలన చేసి, మహాకవి గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలను తన రచనల ద్వారా ప్రశ్నించి, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు గురజాడ కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తూ, తెలుగు భాషా సాహిత్య రంగంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. గురజాడ రచించిన కన్యాశుల్కం తెలుగు నాటక సాహిత్యంలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించిందని, ఆయన సాహిత్యంలో సామాజిక సంస్కరణ, మానవతా విలువలు, సమాజ అభ్యున్నతి వంటి అంశాలు ప్రతిబింబిస్తాయని అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అని చాటి చెప్పిన గురజాడ అప్పారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ సుబ్రహ్మణ్యం, డిఆర్డిఏ పిడి శ్రీమతి రాజ్యలక్ష్మి, జిల్లా ఉపాధికల్పన శాఖాధికారి సురేష్ కుమార్, జిల్లా సహకార సహకార శాఖాధికారి వెంకట సుబ్బయ్య, స్టెప్ సిఈఓ బివి ప్రసాద్, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు

## వైసిపి యువనేత జయ మనోజ్ రెడ్డి

వైసిపి కార్యకర్తలు జోలికి వస్తే ఎంతటి వారైనా సహించరు లేదని ఆదోని వైసిపి యువ నేత జయ మనోజ్ రెడ్డి అన్నారు నిన్న రాత్రి సంతే కొల్లూరు గ్రామంలో పొలంలో పనిచేస్తున్న వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తఎర్ర స్వామి మీద దాడి జరిగిన విషయం తెలుసుకున్న మనోజ్ రెడ్డి గారు వెంటనే హాస్పిటల్ కి వెళ్లి బాధితులను పరామర్శించి భయపడకండి నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చాడు జయ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్సీపి కార్యకర్తను కూటమి నాయకులు మధు సోము కేశవా అనే వ్యక్తులు దాడి చేయడం మంచి పద్ధతి కాదు ఏదైనా ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలి కానీ ఇలా ప్రభుత్వం ఉంది కదా అని దాడి చేయడం ఎంతవరకు కరెక్ట్ అంటారు వైయస్సార్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నందుకు దుర్భాషలాడి దాడి చేయడం అనేది సరైన పద్ధతి కాదని అన్నారు పార్టీ లు వస్తుంటాయి పోతుంటాయి గ్రామాల్లో ప్రశాంతత కోరుకోవాలని వైఎస్ఆర్సిపి కార్యకర్తలను ఎవరైనా సరే దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఆదోని పార్టీ పట్టణ అధ్యక్షుడు దీ దేవా మండల యూత్ అధ్యక్షుడు న ల్లారెడ్డి ప్రతాపరెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు



# శ్రీ చైతన్య, నారాయణ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.

## గుర్తింపు, అనుమతులు, అఫిలియేషన్, ఫైర్ సేఫ్టీపై సమగ్ర తనిఖీలు చేయాలి ఏ ఐ యస్ యఫ్



కర్నూలు సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ పేరుతో నిర్వహిస్తున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యా సంస్థల గుర్తింపు, అనుమతులు, అఫిలియేషన్, ఫైర్ సేఫ్టీ, మౌలిక సదుపాయాలు లేని విద్య సంస్థలు సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక విడుదల కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎస్.ఈరేష్ బి.రంగస్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నియమా నిబంధనలు పాటించకుండా నారాయణ, శ్రీ చైతన్య వివిధ ప్రైవేట్ విద్యాసంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక పాఠశాల బ్రాంచ్ పర్మిషన్ తీసుకొని రెండు మూడు బ్రాంచ్లో తరగతులు నిర్వహిస్తున్న, విద్యార్థుల భద్రతకు అవసరమైన ఫైర్ సేఫ్టీ, భవన భద్రత, కనీస మౌలిక సదుపాయాలు లేని సంస్థలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫీజుల వసూళ్లపై నిబంధనలకు అనుగుణంగా అధికారులు తనిఖీలు నిర్వహించి, తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్పెషల్ క్లాసులు పేరుతో రాత్రి 7 గంటల వరకు తరగతుల నిర్వహిస్తున్నారు. శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కర్నూలు జిల్లా సమితిగా విద్యార్థులందరిని సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శి ఎస్.అభిషేక్ సి.అశోక్ జిల్లా సమితి సభ్యులు మధు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 40 వినతులు.

## కమిషనర్ ఎం.జయకృష్ణ.

తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నందిపత్రిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయని కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఆరు మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 34 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కొర్లగుంట మారుతీ నగర్ లో కలుషితమైన తెలుగు గంగ నీరు వస్తున్నాయి తగుచర్యలు చేపట్టాలని, ఖాదీ కాలనీలో రోడ్లపైన ఉన్న గుంతలు పూడ్చాలని, సప్తగిరి నగర్ నందు డ్రైనేజి కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇండ్లలోనికి వస్తున్నాయి పరిశీలించాలని, గరుడాద్రి నగర్ నందు మురుగునీరు రోడ్లపై వస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతూ, అనారోగ్యం పాలవుతున్నాము తగు చర్యలు తీసుకోవాలని, అంథుల శరణాలయం వద్ద కుక్కలు, దోమల బెడద ఎక్కువగా ఉందని, పట్నూల్ వీధి మెయిన్ రోడ్డుకు సిసి రోడ్డు వేయాలని, ఎస్.కె.డి. నగర్ లో నిర్మిస్తున్న హాస్టల్ వారు వ్యర్థాలు కాలువలో వేయడం వలన దుర్వాసన ఎక్కువగా ఉందని, వరదరాజ నగర్ లో 60అడుగుల రోడ్డు అన్యాక్రాంతం అవుతున్నది పరిశీలించాలని, ఇంటి పన్నులో తన పేరు రామమూర్తిగా మార్చాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను ఆయా విభాగాల అధికారులకు పంపి చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. రామమూర్తి అనే 10 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశానని ఫలితాలు బాగున్నాయని తెలుపగా కమిషనర్ ఆయన్ను అభినందించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు అందరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, సర్వేయర్ గురవా రెడ్డి, మేనేజర్ హసీమ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 92 ఫిర్యాదులు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీయస్



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీయస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) నా కుమారుడికి బెంగుళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.14 లక్షలు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గోనెగండ్లకు చెందిన బోయ హనుమంతు ఫిర్యాదు చేశారు. 2) బ్యాంకు మేనేజర్ (క్రాప్ లోన్ ఇప్పిస్తాను) అని చెప్పి డబ్బులు తీసుకొని, ఇప్పటివరకు రుణం మంజూరు చేయకుండా తిప్పుకుంటున్నారని ఆదోనికి చెందిన అంజిబాబు ఫిర్యాదు చేశారు. 3) పొలం విషయంలో తనపై కొందరు వ్యక్తులు దాడి చేశారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రిష్ణగిరి మండలం, కోయిలకొండ గ్రామానికి చెందిన రాజు ఫిర్యాదు చేశారు. 4) కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కృష్ణగిరి లో పరిచయమైన ఒక వ్యక్తి నా నుంచి రూ. 8 లక్షలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు శ్రీరామనగర్కు చెందిన నారాయణ గౌడ్ ఫిర్యాదు చేశారు. 5) నాకు, మా అన్నకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 26 లక్షలు తీసుకొని ఒక టీచర్ మోసం చేశాడని తిరిగి ఇప్పించాలని కల్లూరు మండలం, బస్తిపాడు గ్రామానికి చెందిన కుర్వ సురేంద్రబాబు ఫిర్యాదు చేశారు. 6) ఒక వ్యక్తి నా స్నేహితులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మాకు తెలియని ఒకొక్కరి వద్ద రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షలు తీసుకుని మోసం చేశారని సగం డబ్బులు మాత్రమే తిరిగి ఇచ్చారని కర్నూలు ఇందిరాగాంధీనగర్కు చెందిన మహేష్ బాబు ఫిర్యాదు చేశారు. 7) హర్యానా నుంచి ముఠా జాతి గేదెలను పంపిస్తామని యూట్యూబ్లో డైరీ ఫామ్ పేరుతో హరీష్ అనే వ్యక్తి నమ్మించి, రూ.లక్ష కు పైగా డబ్బులు తీసుకుని మోసం చేశారని తన నుండి తీసుకున్న డబ్బులను రికవరీ చేసి ఇప్పించాలని కర్నూలు , దొక్కర్స్ కాలనీకి చెందిన మధురిమ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీయస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా , సిఐలు ఇస్మాయిల్ , మస్తాన్ వలి లు పాల్గొన్నారు.

# 11 వేల పోలీస్ పోస్టులు భర్తీ చేయాలి

## ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్





కర్నూలు సిటీ నంది పత్రిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, ఉద్యోగాల భర్తీలో యువత ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్ విమర్శించారు. ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా పరిమిత సంఖ్యలో నోటిఫికేషన్లతో సరిపెట్టడం వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీలో పోలీస్ శాఖలో 20వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని రాష్ట్ర డిజిపి కోరిన ప్రకారం 11639 పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల భర్తీకి రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి అనుమతులు పంపుతున్నామని వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మాయమాటలతో మోసం చేసి ఇప్పుడు కేవలం 2050 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం ముమ్మాటికి నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు, కావున కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రకటనలకు మాత్రమే పరిమితమై ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తే ఏ ఐ వై యఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులను కలుపుకొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమింది పోలీస్ శాఖ కాళీ పోస్టుల మొత్తానికి నోటిఫికేషన్ వచ్చేంతవరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఖాళీలు భర్తీ చేయడానికి పాలకుల నిర్లక్ష్యం వల్ల 7 సంవత్సరాల తర్వాత నోటిఫికేషన్ రావడం జరిగిందని ప్రతి సంవత్సరం నోటిఫికేషన్ లేకపోవడం వల్ల చాలామంది నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి ఎదురుచూసి శాశ్వతం నిరుద్యోగులుగా మారే ప్రమాదం వచ్చిన ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థులకు వయోపరిమితిని 35 సంవత్సరాల కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 2 సంవత్సరాలు అవుతున్న ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల పైన సరైన సమాచారం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వారు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అలా కాకుండా ప్రకటనలకే పరిమితం అవుతూ నిరుద్యోగులను మోసం చేస్తామంటే ఏఐవైఎఫ్ గా నిరుద్యోగులను ఏకతాటిపైకి తెచ్చి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వారి హెచ్చరించారు కార్యక్రమంలో నిరుద్యోగుల జేఏసీ నాయకులు నాగార్జున, వాలంటీర్ అసోసియేషన్ నాయకులు మహబూబ్ బాషా, జిల్లా ఆఫీస్ బేరర్స్ రమేష్, హనుమేష్, బిసన్న, రాజేష్, రాజు, జిల్లా సమితి సభ్యులు రాజు నాగరాజు అంజిత్, జాఫర్ పటేల్, చిన్న, సురేష్, శ్రీకాంత్, కళాఖర్, చంటి, అఖిల్, రవి, తదితరులు పాల్గొన్నారు

# పీజీఆర్ఎస్లో వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో, నాణ్యతతో పరిష్కరించాలి.

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్, 21 నంది పత్రిక: ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో పెండెన్సీ పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాత జాప్యానికి తావులేకుండా తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అలా పరిష్కరించి నప్పుడే ప్రజల్లో అర్జీల పరిష్కారం పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పీజీఆర్ఎస్లో వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో, నాణ్యతతో పరిష్కరించడంతో పాటు అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీ తిరిగి ఓపెన్ కాకుండా సంబంధిత అధికారి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. సంబంధిత అధికారి, ఫిర్యాదు దారులకు సరైన విధంగా స్పష్టంగా సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్బ్యాక్ క్యూఆర్ కోడ్లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, జాన్ ఇర్విన్, సమగ్ర శిక్ష ఏపీసీ అనూరాధ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా సహకార శాఖాధికారి వెంకట సుబ్బయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పందుల పెంపకదారులు నిబంధనలు పాటించాలి



డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 21 డోన్ పట్టణంలో పందుల పెంపకం, వాటిని ఇష్టానుసారంగా సంచరించ నివ్వడం వల్ల ప్రజలకు, పరిసర ప్రాంతాలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ కె. నరేష్ రెడ్డి పందుల పెంపకదారులను హెచ్చరించారు. పందులను పట్టణ వీధుల్లో స్వేచ్ఛగా సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘించి పందులను పట్టణంలో సంచరించనిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు పందుల పెంపకదారులు మున్సిపాలిటీకి సహకరించాలని ఆయన కోరారు.

# జొన్నగిరి గోల్డ్ మైనింగ్ భాగస్వామ్య సంస్థ అధినేత కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూల్ సిటీ నందిపత్రిక తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని ఓమలూరులో ఆదివారం రాత్రి జరిగిన జొన్నగిరి గోల్డ్ మైనింగ్ భాగస్వామ్య సంస్థ అయిన త్రివేణి ఎర్త్మూవర్స్ అధినేత బాలసుబ్రమణియన్ ప్రభాకరన్ కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకల్లో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

# అహోబిలం దేవస్థానం సీఈఓ గా రంగరాజు నియామకం..




ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 21 నంది పత్రిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా రంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన అహోబిల మఠం జిపిఏ గా కూడా పనిచేశారు. రేపు మంగళవారం నాడు ఆయన దేవస్థానం ఏఓ గా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు.

# పోలీస్ ఉద్యోగాల కోసం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణలి

## ఈ నెలాఖరు 30వ తేదీ వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు కు గడువు

## సిఈడిఎం ద్వారా ఉచిత శిక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 21. నంది పత్రిక:రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్,సబ్ ఇన్స్పెక్టర్ ల నియామకాల కోసం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం) ద్వారా ఆఫ్ లైన్, ఆన్ లైన్ విధానంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే అర్హత కలిగిన వారికి శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులకు ఆహ్వానం పలకడం జరిగిందన్నారు. తుది గడువు ఈ నెలాఖరు 30వ తేదీ లోపు ఆన్ లైన్ ద్వారా సిఈడిఎం వెబ్ సైట్ లో దరఖాస్తులు పంపాలని కోరారు. ఆఫ్ లైన్ ఉచిత శిక్షణకు తప్పనిసరి అర్హతగా బిపిఎల్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు.దరఖాస్తు సమయంలోనే సంబంధిత బిపిఎల్ కార్డు ( తెల్ల రేషన్ కార్డు / ప్రైసీకరణపత్రం )సమర్పించాలని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ పోస్టుల భర్తీకి చేయాలని ఆకాంక్షించే, పట్టుదల కలిగిన మైనారిటీ అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ తో పాటు విద్యాపరమైన మద్దతును అందించడమే సిఈడిఎం ఉచిత శిక్షణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పోలీసు ఉద్యోగాలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు రాత పరీక్ష సన్నద్ధత, జనరల్ స్టడీస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, నియామక పరీక్షకు నిర్దేశించిన, సంబంధిత అన్ని అంశాలపై దృష్టి సారించి తర్ఫీదును పూర్తిస్థాయిలో ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీస్ కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు, నిర్దేశించిన అర్హత ప్రకారం లోబడి దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రి సూచించారు.అర్హత,ఆసక్తిగల రాష్ట్రవ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను "సిఈడిఎం-ఏపీ" అధికారిక వెబ్ సైట్ ద్వారా తమకు సంబంధించిన అన్ని పూర్తిగా వివరాలతో వెబ్ సైట్: ... లో నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు: 08645-297535, 7386789966 లకు సంప్రదించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. ఇందులో భాగంగానే కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా విడుదల చేస్తున్న జాబ్ నోటిఫికేషన్ల లో మైనారిటీ నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ఉచిత శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. పోలీస్ శాఖలో నియామకాల కోసం నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న దృష్ట్యా మైనారిటీ నిరుద్యోగ యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకొని విజయం సాధించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు.

# పీజీఆర్ఎస్లో వృద్ధురాలి సమస్య పరిష్కారానికి ఎమ్మార్వోకు వినతి



డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ :21 డోన్ ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్లో ఓ వృద్ధురాలు తన సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్వో రవికుమార్కు వినతిపత్రం అందజేశారు. తన సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని ఆమె కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మార్వో సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అర్జీదారులను నేరుగా కలవాలి

## అర్జీదారులకు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశం

## ఫిర్యాదుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లాల్సిందే

## ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 18 అర్జీలు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు అర్జీదారులను నేరుగా కలిసి, సమస్యలను తెలుసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించిన అనంతరం పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 18 అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్.ఈ. రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డిసిపి శబ్నం శాస్త్రీ, ఏసీపీ నాగరాజు, కార్యదర్శి నాగరాజు, మేనేజర్ జునైద్, ఆర్వో క్రిస్టోఫర్, వాజిద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బద్వేల్‌లో వెంకట సాయి మెడికల్ షాప్ సీజ్

## రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ హెచ్చరిక



**బద్వేల్, సెప్టెంబర్ 21 (నంది పత్రిక ):** బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్డులోని వెంకట సాయి మెడికల్ షాపును డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ( డి ఎం హెచ్ ఓ ) డాక్టర్ వి. మల్లేష్ సోమవారం సీజ్ చేశారు.శనివారం పలు దినపత్రికల్లో "మెడికల్ షాపులోనే వైద్యం" అనే శీర్షికతో వచ్చిన వార్తకు డిప్యూటీ డి. ఎం. హెచ్. ఓ తక్షణమే స్పందించారు. ఆ క్రమంలో షాపుపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తనిఖీ సమయంలో షాపు ప్రొప్రైటర్ రమణ అర్హత లేకుండానే ఒక చిన్నారికి ఇంజక్షన్ వేస్తుండగా అధికారులకు పట్టుబడ్డాడు. అనంతరం షాపు ఆవరణలో విస్తృత తనిఖీలు నిర్వహించగా, వాడేసిన పలు రకాల ఆంటిబయోటిక్ సైరింజెస్ , మెడిసిన్స్ సీసాలు, అలాగే అనుమతి లేని కొన్ని రకాల స్టేరోయిడ్స్ వాడినట్లు ఆధారాలు లభించాయి. డాక్టర్స్ ప్రెస్క్రిప్షన్ లేకుండా, సరైన వైద్య అర్హతలు లేకుండా ట్రీట్మెంట్ చేయడం తీవ్రమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. నియమాలు ఉల్లంఘించే మెడికల్ షాపులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ షాపును సీజ్ చేశారు. అనంతరం బద్వేల్ పట్టణంలోని పలు మెడికల్ షాపులు మరియు ఆసుపత్రి లోని మెడికల్ షాపులను తనిఖీ చేసి క్వాలిఫైడ్ ఫార్మసిస్టు లేకుండా ఇతరులతో మందుల పంపిణీ చేస్తే చర్యలు తీసుకోబడును అని హెచ్చరించడం జరిగింది ఈ తనిఖీలో కోట వీధి (యూ పీ హెచ్ సి ) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశివర్ధన్ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ డి. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శివయ్య, హెల్త్ అసిస్టెంట్లు శ్రీరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న ₹6,800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

## ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ అభిలాష్

**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 21 (నంది పత్రిక):**రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు ₹6,800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ లు సకాలంలో అందకపోవడంతో పేద, బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని,బకాయిల కారణంగా విద్యార్థులు తమకు రావాల్సిన సర్టిఫికెట్లను యాజమాన్యాల దగ్గరినుంచి పొందడంలో కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు.విద్యార్థుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఎన్నికల సమయంలో విద్యార్థులకు అండగా ఉంటామని,వారి భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న సుమారు ₹6,800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇకపై బకాయిలు పేరుకుపోకుండా సకాలంలో నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో రానున్న రోజుల్లో ఏబీవీపీ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్తీక్,గురు శివ,బ్రాహ్మయ్య, శోభ,యాసిన్, రితీష్,జయచంద్ర, మహేష్, శేఖర్, ముని, అజయ్, మధు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు: తప్పిన పెను ప్రమాదం

**వెలుగోడు సెప్టెంబర్ 21(నంది పత్రిక):**మండలంలోని బోయరేవుల గ్రామ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆత్మకూరు నుండి నంద్యాల వైపు వెళ్తున్న ఈ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో పలువురు ప్రయాణికులు, విద్యార్థులు ఉన్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పి, ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ డోర్) మరియు ప్రధాన ద్వారం ద్వారా ప్రయాణికులు సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణమా లేదా బస్సులో సాంకేతిక లోపం ఉందా అనేది తెలియాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులు బస్సుల ఫిట్‌నెస్, సిబ్బంది విధులపై మరింత శ్రద్ధ వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



# "ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ మార్గదర్శి, యుగకర్త"..

## అడిషనల్ డీఎంఈ కర్నూల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆధునిక తెలుగు సాహిత్యానికి మార్గదర్శి, యుగకర్తగా కీర్తించబడుతున్న ప్రముఖ కవి, రచయిత, సామాజిక సంస్కర్త గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఘనంగా నివాళులు అర్పించారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఛాంబర్‌లో గురజాడ అప్పారావు చిత్రపటానికి అడిషనల్ డీఎంఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి మార్గదర్శిగా, యుగకర్తగా కీర్తించబడుతున్నారని అన్నారు. తన రచనల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలు, అన్యాయాలు, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారని తెలిపారు. గురజాడ రచనలు కేవలం సాహిత్యపరమైన విలువలకే పరిమితం కాకుండా సామాజిక సంస్కరణ, మానవతా విలువలు, సమానత్వం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ఉన్నాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ముఖ్యంగా కన్యాశుల్కం వంటి రచనల ద్వారా అప్పటి సమాజంలోని సామాజిక దురాచారాలను ఎత్తిచూపి, మార్పు కోసం తన కలాన్ని ఒక సామాజిక ఆయుధంగా ఉపయోగించారని అన్నారు."దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్" అనే గురజాడ సందేశం నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని అని అన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ లు డాక్టర్ అరుణ, డాక్టర్ రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పుష్పలత, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ వైష్ణవి, లెక్చరర్లు బి. సురేష్, భవానీ ప్రసాద్, సరిత, ఎస్.ఆర్. డాక్టర్ ఆండ్రియల్ బ్రయాన్, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కంప చెట్లతో ఇబ్బందులు.. స్పందించిన ప్రసన్న

## సొంత ఖర్చులతో రహదారి శుభ్రం.. సేవే లక్ష్యమంటూ ముందుకు



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 21 (నంది పత్రిక ):** రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్ టీ.వీ.ఎస్ షోరూమ్ వీధిలో రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల ముఖాలకు కంపలు తగులుతుండటంతో ప్రమాదాలకు అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోరుమామిళ్లకు చెందిన ప్రసన్న (అయ్యప్ప) వెంటనే స్పందించి, తన సొంత ఖర్చులతో రహదారికి అడ్డుగా ఉన్న కంప చెట్లను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చిన్నచిన్న సమస్యలపై తన స్థాయిలో స్పందిస్తూ, గతంలోనూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు బాధ్యతగా సేవ చేయడమే ప్రధాన లక్ష్యమని ప్రసన్న (అయ్యప్ప) పేర్కొన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రజలకు అవసరమైన విషయాల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రజలతో మమేకమై ప్రజల మనిషిగా ఉండాలనే ఆకాంక్ష తనకు ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

# జీ.ఎన్.ఎం పరీక్షలపై సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్న జీ.ఎన్.ఎం పరీక్షలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిని పరిశీలించి, పరీక్షల నిర్వహణ తీరును స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లకు పరీక్షలను నిబంధనల ప్రకారం, కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.

# టిడిపిలో చేరిన వైసిపి ఎంపీటీసీ కే మునిస్వామి మరో 10 కుటుంబాలు

## కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి

**కర్నూలు సిటీ నంది పత్రిక** కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ కురువ మునిస్వామి తోపాటు 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం కల్లూరు అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ కురువ మునిస్వామి మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరుతున్నామని తెలిపారు. భవిష్యత్ లో గౌరు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. టీడీపీలో చేరిన వారిలో పూలచిన్న, వెంకటరాముడు, ఎర్రమల, కట్టెల నాగన్న, మునీశ్వరుడు, బి శ్రీనివాసులు, పి ఖాజా, ఖాసిం, చంద్రముని, చిన్న వెంకటప్ప ఉన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దటేకూరు గ్రామ టీడీపీ నాయకులు ఆల సాయి తరుణ్ రెడ్డి, దొడ్డిపాడు మహబూబ్ భాష, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



# కోయంబత్తురులోని ఈషా ధ్యాన కేంద్రన్ని సందర్శించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూల్ సిటీ నందిపత్రిక** తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ సమీపంలోని వెల్లియంగిరి పర్వతాల అడుగుభాగంలో ఉన్న ఈషా యోగా కేంద్రాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు సందర్శించారు..ఈ సందర్భంగా అక్కడ ఉన్న 112 అడుగుల ఆదియోగి విగ్రహాన్ని, లింగ భైరవి అమ్మవారి విగ్రహంతో పాటు ధ్యాన లింగం, తీర్థ కుండాలను సందర్శించిన అయన, ధ్యాన కేంద్రంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా, ధ్యాన కార్యక్రమాలతో పాటు, మహాశివరాత్రి రోజున నిర్వహించే ఆధ్యాతిక , సాంస్కృతిక కార్యక్రమాల పై ఫౌండేషన్ నిర్వాహకులతో మాట్లాడి తెలుసుకున్నారు.. అనంతరం ఆదియోగి విగ్రహం ముందు ఎంపీ నాగరాజు ధ్యానం చేశారు.

# ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండానే భూమి ఆన్‌లైన్ మార్పు?

## బొప్పాపురంలో రెవెన్యూ రికార్డులపై వివాదం.. జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధితుడు, న్యాయం చేస్తామని హామీ



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 21 (నంది పత్రిక):** పేదల భూముల విషయంలో రెవెన్యూ రికార్డుల నిర్వహణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోరుమామిళ్ల మండలం బొప్పాపురం గ్రామంలో 1987లో డీకేటీ పట్టా కింద మంజూరైన భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డుల మార్పుపై కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదం చివరకు జిల్లా ఉన్నతాధికారుల వద్దకు చేరింది.బాధితుడు చాటకొండ ఆనందరావు ఈరోజు కడప జిల్లా కలెక్టరేట్ లో జరిగిన గ్రీవెన్స్ సెల్ లో జాయింట్ కలెక్టర్ (జే.సీ ) మేడం కి లిఖితపూర్వకంగా అర్జీ సమర్పించారు. అర్జీని పరిశీలించిన జేసీ విచారించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితుడు తెలిపారు.

**అసలేం జరిగింది?** బొప్పాపురం గ్రామంలోని సర్వే నంబర్ 187-1లో 15-08-1987న డీకేటీ పట్టా కింద 1.79 ఎకరాల భూమి తమ తల్లి చాటకొండ జీవమ్మ పేరు మీద మంజూరైందని ఆనందరావు తెలిపారు. తమ తల్లి జీవమ్మకు ముగ్గురు సంతానం ఉన్నారని, తల్లి తర్వాత ఆ భూమిపై ముగ్గురికి సమాన హక్కు ఉంటుందని పేర్కొన్నారు.అయితే తమ కుటుంబంలోని ఒక వ్యక్తి ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, మిగిలిన వారసుల చీూజ లేదా ఇతర వారసత్వ ఆధారాలు సమర్పించకుండానే రెవెన్యూ రికార్డుల్లో తన పేరును నమోదు చేయించుకుని ఆన్‌లైన్‌లో భూమిని తన పేరు మీదకు మార్చుకున్నారని ఆయన ఆరోపించారు.

**నిబంధనలకు విరుద్ధంగా మ్యూటేషన్** సాధారణంగా వారసత్వంగా భూమి మార్పు చేయాలంటే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తప్పనిసరి. అంతేకాకుండా విఆర్వో, ఆర్ఐ విచారణ, మిగిలిన వారసులకు నోటీసులు ఇవ్వడం వంటి ప్రక్రియలు పాటించాలి. కానీ ఈ కేసులో అలాంటి ప్రక్రియ ఏదీ పాటించకుండానే నేరుగా ఆన్‌లైన్ ఎంట్రీ చేసేశారని బాధితుడు జేసీ దృష్టికి తీసుకెళ్లారు.ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా, పోరుమామిళ్ల డిప్యూటీ తాసిల్దార్ కు అర్జీ ఇచ్చినా స్పందన రాలేదని, ప్రస్తుతం ఈ సర్వే నంబర్ పై రీ-సర్వే జరుగుతున్నందున వివాదం పరిష్కారం అయ్యే వరకు రికార్డును హోల్డ్ లో పెట్టాలని ఆయన కోరారు.

**జేసీ కి ఇచ్చిన వినతిలో కీలక అంశాలు:** జాయింట్ కలెక్టర్ కి ఇచ్చిన అర్జీలో బాధితుడు ఈ క్రింది అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

1. 1987 నాటి అసలు డీకేటీ అసైన్మెంట్ రిజిస్టర్ పరిశీలన
2. వారసత్వ మార్పు కోసం ఇచ్చిన దరఖాస్తు, దానికి జతపరిచిన పత్రాలు ఏమిటి?
3. ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండా ఏ ఆధారాలతో మ్యూటేషన్ చేశారు? ఏ అధికారి లాగిన్ తో ఆన్‌లైన్ చేశారు? 4. మిగిలిన వారసులకు నోటీసులు ఇచ్చారా? లేదా? ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా రికార్డు మార్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని, అర్హులైన ముగ్గురు వారసులకు న్యాయం చేయాలని ఆనందరావు విజ్ఞప్తి చేశారు.జేసీ మేడం సానుకూలంగా స్పందించి, సంబంధిత ఆర్డీవో, తాసిల్దార్ తో విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితుడిలో ఆశలు చిగురించాయి.

# సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేయించిన... మాజీ సర్పంచ్, తర్తూరు దేవస్థానంఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి




**జూపాడుబంగ్లా సెప్టెంబర్ 21 (నంది పత్రిక)** మండల పరిధిలోని తరిగోపుల నుండి 80బన్నూరు రైస్ మిల్ వరకు మరియు రామసముద్రం వరకు దెబ్బతిన్న రోడ్డుతో ప్రజలు వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మాజీ గ్రామ సర్పంచ్,తర్తూరు దేవస్థాన ఆలయ కమిటీ చైర్మన్ ముందడి నారాయణరెడ్డి సొంత ఖర్చుతో రోడ్లకు మరమ్మతులు చేయించాడు. గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డును బాగు చేయించారు. ప్రజలు సమస్యను గుర్తించి వెంటనే స్పందించి మరమ్మతులు పనులు చేపట్టడంపై గ్రామస్తులు మందడి నారాయణరెడ్డి, టిడిపి యువ నాయకుడు మందడి దొరబాబు రెడ్డికి రోడ్డు మార్గం బాగు చేయడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు.



# ఏ టి ఎస్ సెంటర్లను రద్దు చేయాలి సెంటర్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలి

## సీఐటీయూ, ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘాల డిమాండ్



**కర్నూలు సిటీ నంది పత్రిక** ఏ టీ ఎస్ సెంటర్లను రద్దు చేయాలని, ఏటిఎస్ సెంటర్లలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఆటో యూనియన్ సిఐటియు ఎఐటియుసి నగర అధ్యక్షులు దూదేకొండ కుమార్, రాము ఆధ్వర్యంలో చలో ఏ టి ఎస్ సెంటర్ చిన్న టేకూర్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు ఆటో యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఏఐటియుసి నగర అధ్యక్షులు చంద్రశేఖర్ ఎ ఐ టియు సి రాష్ట్ర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి పి మహమూద్ కృష్ణారెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఆటోరంగంలో పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం సానుభూతి లేదు అన్నారు ఆటో రంగంలోకి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులు ఉన్నత విద్యాధికులు ఉపాధి కోసం ఆటో డ్రైవర్లుగా మారుతున్నారు నిరుద్యోగులు కుటుంబ పోషణ కోసం ఉపాధి కొరకు ఆటోలు కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకులు సహకరించుకున్నా ప్రైవేట్ ఫైనాన్స్ ల వద్ద అధిక వడ్డీలకు కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటూ ప్రజల సేవ చేసినారు అలాంటి వారి పై ప్రభుత్వాలు జాలి దయా లేకున్నా అనునిత్యం పెట్రోలు డీజిల్ రేట్లు పెంచడం ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు ఆర్టిఏ చలానాలు ఈ చలానా ఫైన్లు మ్యాట్రిక్స్ కెమెరాల సెన్సార్ చలానాలే కాకుండా ప్రైవేట్ ఫైనాన్స్ అధిక వడ్డీలు దోపిడీలకు ఆటో డ్రైవర్ల గురవుతున్నారు అన్నారు శతాబ్ది కాలం క్రితం ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి నూతన కార్మిక చట్టాలను అమలులోకి తెచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇప్పుడు రవాణా రంగా కార్మికుల మీద జూలు విధిల్చి రవాణా రంగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనతో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేసే ఏ టి సి సెంటర్లను ప్రైవేటుపరం చేసింది అన్నారు వాహన కార్మికులకు భారీగా జరిమానాలు విధించాలని మోటర్ వాహన చట్టం తీసుకొచ్చింది అందులో భాగంగానే జీవో నెంబర్ 21ను తీసుకొచ్చింది గతంలో ఉన్న 304-ఎ సెక్షన్ ను తొలగించి భారత న్యాయ సంహిత 2023 డ్రైవర్లను జైలు పాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ సెక్షన్ 106-1, 106-2 పేరుతో అమలు చేయడం వల్ల డ్రైవర్లు ఏదైనా ప్రమాదం చేస్తే పది లక్షల రూపాయలు జరిమానా పది సంవత్సరాల జైలు శిక్ష విధించాలని చట్టం చెబుతుంది అన్నారు దీనివల్ల ఆటో లారీ ఇతర రవాణా రంగ కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారై ప్రమాదం ఉన్నది అన్నారు తక్షణమే భారత న్యాయ సంహిత 2023 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆటో యూనియన్ కార్మిక సంఘాలు డిమాండ్ చేశారు ప్రజలకు అనేక రకాలుగా సేవ చేస్తున్న ఆటో డ్రైవర్లకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించడం లేదు ఆటో కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి కానీ ఆటో కార్మికులను ఆదుకోవాలని చిత్తశుద్ధి ప్రభుత్వాలకి లేకపోవడం బాధాకరం ప్రభుత్వానికి ఆదాయం ఉన్న రవాణా రంగాన్ని నిర్లక్ష్యం చేయడమే గాక డ్రైవర్లను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి వెంటనే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏటీఎస్ సెంటర్లను రద్దు చేయాలని ఏ టి ఎస్ సెంటర్లో జరుగుతున్న అవినీతిని అక్రమాలను అరికట్టాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు ఏ టీ ఎస్ నిర్వాహకులకు చర్చలు జరిగాయి సమస్యలు పరిష్కరిస్తామని ఏ టీ ఎస్ నిర్వాహకులు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు ఎఐటియుసి ఆటో యూనియన్ నాయకులు ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీఆర్ఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

### వెలుగోడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట 5వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

### పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని వీఆర్ఏల హెచ్చరిక



**వెలుగోడు సెప్టెంబర్ 21(నంది పత్రిక):** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగోడు మండల విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు (వీఆర్ఏలు) చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 11 మంది వీఆర్ఏలు శాంతియుతంగా నిరసన తెలుపుతూ, ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ... ఏళ్లుగా అరకొర వేతనాలతో వీఆర్ఏలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ వీఆర్ఏలకు వెంటనే 'పే స్కేల్' వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు అర్హులైన వీఆర్ఏలందరికీ ఎలాంటి కఠిన నిబంధనలు లేకుండా పదోన్నతులు కల్పించాలని, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలపై సానుకూలంగా స్పందించే వరకు ఈ పోరాటాన్ని ఆపేది లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో వెలుగోడు మండల వీఆర్ఏలు పకీరయ్య, రాజేంద్రప్రసాద్, నూరుల్లా, వాజిద్, రాజలింగమయ్య, బాలరాజు, జంబులయ్య, సామన్న, సాయిరాం, రమేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలి



**నంది పత్రిక గడివేముల** గడివేముల మండలంలో ఆర్కే ఫంక్షన్ హాల్ ఆవరణలో సోమవారం పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి తో కలిసి గడివేముల మండల పరిధిలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలోని గ్రామాలలోని టిడిపి నాయకులు కలిసికట్టుగా పని చేయాలని, స్థానిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించేందుకు గ్రామాలలోని ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశం సత్యనారాయణరెడ్డి. రామచంద్ర రెడ్డి. సుభద్రమ్మ. లక్ష్మీదేవి. ఈశ్వర్ రెడ్డి. అంకజాల కృష్ణ యాదవ్. షేక్ అజీమ్ భాష. మరియు టిడిపి కార్యకర్తలు

## మద్యం సేవించి వాహనం నడిపితే జైలుశిక్ష తప్పదు

**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 21** మద్యం సేవించి వాహనాలు నడిపిన రెండు కేసుల్లో డోన్ కోర్టు నిందితులకు ఐదు రోజుల జైలు శిక్ష విధించింది. డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు సోమవారం కోర్టులో విచారణకు వచ్చాయి. ఈ కేసుల్లో నిందితులైన కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన అకేపోగు సురేంద్ర (37), వెల్దుర్తి మండలం బోగోలు గ్రామానికి చెందిన వి.మహేష్ (47)లకు డోన్ హానరబుల్ స్పెషల్ జ్యుడీషియల్ ×× క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. నూరుల్లా ఐదు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష, జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



## అభివృద్ధి పనులను ఎందుకు ఆపుతున్నారు?

### కూటమి నేతలకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సవాల్



**డోన్, నంది పత్రిక సెప్టెంబర్ 21:** పట్టణంలోని కంబాలపాడు సర్కిల్ ఎం. కన్వెన్షన్ హాలులో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై పలు విమర్శలు, ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు నాలుగోసారి కూడా మోసపోయారని బుగ్గన విమర్శించారు. అక్కా, బావ, వదిన, చెల్లెమ్మ అంటూ హామీలు ఇచ్చి, ప్రస్తుతం వాటిని అమలు చేయలేక డబ్బులు లేవని చేతులెత్తేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 44 లక్షల మంది తల్లులకు అమ్మఒడి, 54 లక్షల మంది రైతులకు రైతుభరోసా అందించామని తెలిపారు. ఆసరా పథకం ద్వారా అక్కచెల్లెమ్మలకు సుమారు రూ.25 వేల కోట్లు అందించామని పేర్కొన్నారు.కాపు నేస్తం అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆ హామీని కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం చక్కటి పాలన అందిస్తోందని చెబుతున్న కూటమి నేతలు ఏకగ్రీవాల కోసం ప్రయత్నించడం కాకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అడగాలని సవాల్ చేశారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.డోన్ ఎంపీడీవో కార్యాలయ భవనం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేకు ప్రారంభోత్సవానికి సమయం లేదని చెప్పారని, అదే సమయంలో మున్సిపాలిటీ సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసే ట్యాంకర్ ప్రారంభానికి మాత్రం సమయం ఉందని బుగ్గన ఎద్దేవా చేశారు.గోరుకల్లు ప్రాజెక్టు నుంచి సుమారు రూ.350 కోట్లతో డోన్‌కు నీటిని తీసుకువచ్చే పనులు చేపట్టామని, 2024 డిసెంబర్ నాటికి నీరు రావాల్సి ఉన్నప్పటికీ పనులు ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్నించారు. పనులను స్థానిక ఎమ్మెల్యే తెరవెనుక అడ్డుకున్నారని ఆరోపించారు. బీసీ విద్యార్థుల కోసం తమ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, హాస్టల్ భవనాలు నిర్మించామని, ప్రస్తుతం వాటిలో కనీసం కుర్చీలు, టేబుళ్లు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని విమర్శించారు.డోన్ నియోజకవర్గంలో ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జా చేస్తారేమోనని ప్రజలు భయపడుతున్నారని ఆరోపించిన బుగ్గన.. "ల్యాండ్, శాండ్, వైన్, మైన్... అన్నీ పోతున్నాయి" అంటూ వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను తొలగించగలరేమో కానీ, ఆ పనుల ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిన గుర్తులను చెరపలేరన్నారు.డోన్‌లో అండర్‌పాస్‌కు శాంక్షన్ వచ్చి పనులు ప్రారంభమైన తర్వాత ఎందుకు నిలిపివేశారని, కొత్తపల్లె సమీపంలో ఎస్సీ విద్యార్థుల కోసం శాంక్షన్ చేసిన భవన నిర్మాణాన్ని ఎందుకు ఆపారని ప్రశ్నించారు. "మీరు కొత్తగా తీసుకొచ్చింది ఏమీ లేదు.. మేము తీసుకొచ్చిన అభివృద్ధి పనులను ఎందుకు ఆపుతున్నారు?" అని బుగ్గన నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే కోట్ల కనీసం డోన్ నియోజకవర్గంలోని గ్రామాల పేర్లు చెప్పాలని బుగ్గన అన్నారు. అభివృద్ధి పనులు చేపట్టకుండా ఏకగ్రీవాల కోసం ప్రయత్నిస్తే తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధైర్యంగా ఎదుర్కొంటుందని, నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీటీసీ రాజకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దినేష్‌గౌడ్, నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, మల్లంపల్లి రామచంద్రుడు, అడ్వకేట్ నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాత్రికేయ గణపతికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక పూజలు

**కర్నూలు సిటీ నంది పత్రిక** పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది పాత్రికేయ గణపతి మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జిల్లాలో శాంతిభద్రతలు మరింత పటిష్టంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు, పాత్రికేయులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏ ఐ సి టీ ఇ ప్రాయోజిత అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు




**కర్నూలు సిటీ నంది పత్రిక** సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం క్వాంటం టెక్నాలజీ క్యూబిట్స్ నుండి అధిక ప్రభావ ఆవిష్కరణల వరకు అనుభవపూర్వక అభ్యాసం అనే అంశంపై ఏ ఐ సి టీ ఇ ప్రాయోజిత అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్ డి పి) అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 15 నుండి 21వ తేది వరకు విజయవంతంగా నిర్వహించారు.ఫ్యాకల్టీ సభ్యులు, పరిశోధక విద్యార్థులు పీజీ విద్యార్థులకు క్వాంటం టెక్నాలజీలో అనుభవపూర్వక అభ్యాసాన్ని అందించడం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు (ఎస్ డి జి ఎస్) అనుగుణంగా వినూత్న ఆవిష్కరణలను అనుసంధానించడం ఈ వారం రోజుల ఎఫ్డీపీ ముఖ్య ఉద్దేశం. దేశ వ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 60 మంది ఫ్యాకల్టీ సభ్యులు, పరిశోధక విద్యార్థులు పీజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. క్యూబిట్స్ ప్రాథమిక అంశాలు, క్వాంటం కంప్యూటింగ్ సూత్రాలు సుస్థిరత, ఆరోగ్య సంరక్షణ, ఇంధనం, వాతావరణం విద్య వంటి రంగాలలో వాటి అధిక ప్రభావ అనువర్తనాలను అర్థం చేసుకోవడానికి ఈ ఎఫ్డీపీ ఒక వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డా ఆర్ నవీన్, కో- కోఆర్డినేటర్ డా ఎస్ ఏ శివకుమార్ సమన్వయం చేశారు. వారం రోజుల ఎఫ్ డీపీ ని ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా నిర్వహించడంలో వారు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ లు, ఎన్ ఐ టీ లు, ఐఐ ఎస్ సి బెంగళూరు వంటి ప్రముఖ సంస్థల నుండి 10 మంది ప్రముఖ వనరు వ్యక్తులు క్వాంటం ఫండమెంటల్స్, క్వాంటం అల్గారిథమ్స్, క్వాంటం-ఎన్‌హాన్స్‌డ్ ఏఐ మోడల్స్ సుస్థిరాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే ఆవిష్కరణలపై నిపుణుల ప్రసంగాలు అందించారు. హ్యాండ్స్-ఆన్ సెషన్లు, ఇంటరాక్టివ్ చర్చలు, అనుభవపూర్వక అభ్యాస కార్యకలాపాలు పాల్గొన్న వారికి క్లాసికల్ నుండి క్వాంటం నమూనాలకు మారడంపై విలువైన అంతర్దృష్టులను అందించాయి. కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ నవీన్, యాజమాన్యం అటల్ ఎఫ్ డి పి ని మంజూరు చేసి స్పాన్సర్ చేసినందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏ ఐ సి టీ ఇ) కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో ఫ్యాకల్టీ అభివృద్ధి, పరిశోధన నైపుణ్యం, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో ఏ ఐ సి టీ ఇ అందిస్తున్న నిరంతర మద్దతును వారు అభినందించారు. కార్యక్రమం ఘన విజయానికి కృషి చేసిన వనరు వ్యక్తులు, పాల్గొన్న వారందరికీ కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ యఫ్ డి పి విజయవంతంగా నిర్వహించడం అనేది క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక రంగాలలో అధునాతన సాంకేతిక విద్య, పరిశోధన సంస్కృతి మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల నిబద్ధతను తెలియజేస్తుంది.

## హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తరించాలి - మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్




**కర్నూలు సిటీ నంది పత్రిక** పాతికేళ్లుగా కర్నూలులో వైద్యరంగంలో అనేక సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సంస్థ తన సేవలను మరింతగా విస్తృతం చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక పోస్టర్ ను ఆయన తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యో నారాయణో హరి అన్న సూక్తిని నిజం చేసేలా హార్ట్ ఫౌండేషన్ సరికొత్త ఆలోచనతో ముందుకు సాగాలని కోరారు. సమాజంలోని ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని, అప్పుడే బలమైన సమాజం ఏర్పడుతుందని టీజీ వెంకటేష్ అన్నారు. డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ 2002 లో తాము ప్రారంభించిన హార్ట్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో వైద్యపరమైన అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. పోలీసులకు, పాత్రికేయులకు, మున్సిపల్ ఉద్యోగులకు పలుమార్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని చెప్పారు. వివిధ విభాగాల్లో విశిష్ట సేవలందించిన సూపర్ స్పెషలిస్ట్ వైద్యులకు 2005 నుండి ప్రతి యేటా వరల్డ్ హార్ట్ డే నాడు అవుట్-స్థాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తమ సంస్థ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్ 29 న కర్నూలు హెల్త్ క్లబ్ లో నిర్వహించబోయే వరల్డ్ హార్ట్ డే కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. ప్రసాద్ లాల్ కు ఈ అవార్డును టీజీ వెంకటేష్ చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ టీజీ వెంకటేష్ సహాయ, సహకారాలతోనే ఈ స్థాయికి చేరిందని డా. చంద్రశేఖర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. భవాని ప్రసాద్, హార్ట్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు నాగేశ్వరబాబు, సుస్వరం వాసు పాల్గొన్నారు.

## కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి శ్రీశైలం దేవస్థానం తరుపున పట్టువస్త్రాల సమర్పణ

**శ్రీశైలం సెప్టెంబర్ 21(నంది పత్రిక)** కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం తరుపున (21.09.2025) పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభమైన కాణిపాక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేదీన ముగియనున్నాయి. ఈ మేరకు శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి జి. లక్ష్మీశ్వరి, శ్రీమతి జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ వేమిరెడ్డి కోటారెడ్డి, శ్రీ వాయిగండ్ల వెంకటేశ్వర్లు, శ్రీ ఆకుల శ్రీనివాసులు, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు, తదితరులు ఈ పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమములో పూతలపట్టు నియోజకవర్గం గౌరవ శాసనసభ్యులు డా. కె. మురళీమోహన్, కాణిపాక దేవస్థాన ధర్మకర్తల మండలి శ్రీ వి. సురేంద్రబాబు, కార్యనిర్వహణాధికారి శ్రీ కె.పెంచలకిషోర్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. అనంతరం ఈ దేవస్థానం అధ్యక్షులను, ధర్మకర్తల మండలి సభ్యులను, అధికారులను, అర్చకస్వాములు, వేదపండితులు వేదాశీర్వచనముతో సత్కరించారు. కాగా ఆలయ సంస్కృతి సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిసంవత్సరం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సమయములో శ్రీశైల దేవస్థానం తరపున ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతోంది.



# డోన్ నియోజకవర్గం కరువు ప్రాంతంగా ప్రకటించాలి





**నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి**

**పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి.**

**రాయలసీమ ప్రాంత కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి**

**సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు**

**బేతంచెర్ల సెప్టెంబర్ 21 ( నంది పత్రిక ).** సీపీఐ, వైయస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏపీ రైతు సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. తాసిల్దార్, ఎంపీడీవో లకు వినతిపత్రం ను సోమవారం సమర్పించడమైనది. నంద్యాల జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా,రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వెంటనే డోన్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగాప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు డిమాండ్ చేశారు. బేతంచర్ల పట్టణంలోని పాత బస్టాండ్ నందు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్.ఎన్న అధ్యక్షతన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్,మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ రైతు సంఘం నాయకులు రమేష్ రెడ్డి, మాల మహానాడు బొల్లి మద్దిలేటి హాజరై అనంతరం వారు మాట్లాడుతూ, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను మాఫీ చేసి రుణాలను రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాల పిల్లలకు అన్ని రకాల విద్యా ఫీజులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని, పశువులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు, హంద్రీ-నీవా కాలువ ద్వారా డోన్ నియోజకవర్గం లోని అన్ని చెరువులను నీటితో నింపి, భూగర్భ జలాలను పెంచడంతో పాటు,సాగునీరు మరియు తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావంతో ప్రజలు నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో,14 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వ రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ ధరలకు ప్రజలకు పంపిణీ చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను అరికట్టేందుకు,వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి, రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన గ్రామీణ ఉపాధి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 202627 సంవత్సరానికి రోజువారీ వేతనం రూ.312గా ఉంది; అందువల్ల రూ.600 వేతనం అనేది ఈ ధర్నా ద్వారా చేస్తున్న అదనపు డిమాండ్‌గా ప్రభుత్వం పరిగణించాలని నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ, వైఎస్ఆర్సిపి, కాంగ్రెస్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటియుసి, ఏపీ.రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, దళిత కుల పోరాట సమితి, చేతి వృత్తిదారుల సమాఖ్య, నాయకులు, కార్యకర్తలు, తాలూకా తిరుమలేష్, డి.దస్తగిరి, బాలు, మధు, ఖదీర్, గోపి, రాముడు, సుబ్బరాయుడు, ప్రసాద్,ఈశ్వర్,చిన్నగోపి, అన్వాల.తిరుమలేష్, శ్రీనివాసులు, వెంకట రాముడు,పురుషోత్తం రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, మంగలి మద్దయ్య, రాఘవరెడ్డి, కొట్టాల రవి, కృష్ణయ్య హెప్రీ బాబు, ఆదాము, జయరామిరెడ్డి, నాగ తిమ్మయ్య, సతీష్, సంజీయుడు, సోమన్న, శ్రీరాములు, నాగేశ్వరరావు, నాగ తిమ్మయ్య, నగేష్, సుంకన్న, నాగార్జున, కృష్ణ, మధు, సుధాకర్, మునిస్వామి, బొల్లి.మద్దిలేటి మరియు విద్యార్థులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కర్నూలు హైకోర్టు బెంచ్ విషయంలో సానుకూలంగా స్పందించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లిసా గిల్

**కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బి చంద్రుడు**

**ప్రధాన కార్యదర్శి పి. మహేశ్వర్ రెడ్డి**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో బి చంద్రుడు అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన న్యాయమూర్తితో కర్నూల్లో హైకోర్టు బెంచి విషయంపై సుదీర్ఘమైన టువంటి విశ్లేషించి అలాగే కర్నూలు జిల్లా న్యాయవాదులు 24 రోజులు నిరాహార దీక్ష కేవలము క్యాంపుకోర్టు కాదని తప్పనిసరిగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని దీక్ష చేయడం వల్ల ఈ విషయంపై గత వారంలో ప్రధాన న్యాయమూర్తి పిలుపు మేరకు కర్నూలు జిల్లా న్యాయవాదులు సుమారు 20 మంది లిసా గిల్ ని కలిసి కర్నూల్ లో హైకోర్టు బెంచి విషయంపై గత 30 సంవత్సరాలుగా భౌగోళికంగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ వివక్షత ఉందని ప్రధాన న్యాయమూర్తి కి తెలియ వినతి పత్రం ఇవ్వడం అయినది అలాగే హైకోర్టు బెంచ్ కర్నూల్ లో ఏర్పాటుకు సంబంధించి ఏ సమయం లోన ప్రభుత్వము ఆర్థికమైన అంశాల్లో వచ్చిన ప్రధాన న్యాయమూర్తిగా తమ యొక్క విధులు తప్పనిసరిగా నిర్వహించి కర్నూల్ లో హైకోర్టు బెంచ్ కి సహకారం చేస్తామని ప్రధాన న్యాయమూర్తి సానుకూలంగా స్పందించడం జరిగింది . పై సమావేశంలో సీనియర్ న్యాయవాదులు వై ఏ రామసుబ్బారెడ్డి, వై జయరాజ్, నాగేంద్రనాథ్, కే ఓంకార్, చాంద్ బాషా, మరియు కేసీ రాముడు, భావన కుమార్, బార్ అసోసియేషన్ ట్రెజరర్ జి సుమనారాణి,ఐ ఏ ఎల్ రవికాంత్ ప్రసాద్, వెంకటేశ్వర్ రెడ్డి,హెచ్ కె జలంధర్ రావు, కే కపిలేశ్వరయ్య, హైకోర్టు న్యాయవాదులు జయ జానకి రామ్ రెడ్డి, టి కుమార్ బాబు, సూర్యనారాయణ,శ్రావణ్ కుమార్,ధీరజ్,తదితరులు ఎక్కువ సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## కర్నూలు నగరంలో వినాయక ఉత్సవాలు.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో శ్రీవినాయక చవితి నవరాత్రుల సందర్భంగా శ్రీగణేష్ మహోత్సవసమితి కర్నూలు నగరం ఆధ్వర్యంలో వేల్పుల గోపాల్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలను ఏకధాటిగా చేసుకొని స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనే విధంగా భక్తి ప్రేమలతో కలిసి ముందుకు సాగాలని బాల గంగాధర్ తిలక్ స్పూర్తి భారత దేశానికి ఎంతో కీర్తి తెచ్చిపెట్టారు కుల మతాలకు అతీతంగా జరుపుకునే ఉత్సవాలు కనుక నిమజ్జనం జరుగు ప్రదేశంలో అందరు కలిసి ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అలాగే నగరం అంతా అలంకరణ భాగంగా వాహనంలకు ఆటోలకు బైకులకు కాషాయ జెండాలను అలంకరణ రైల్వే స్టేషన్, వెంకటరమణ కాలని, అశోక్ నగర్ శివాలయం, చేయడం జరిగింది ఈకార్యక్రమంలో వేల్పుల గోపాల్ రాఘవేంద్ర బెస్త ఈరన్న మధుగౌడ్ రఘునాథ్ గౌడ్ ధరణిష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కర్నూలు గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టాలి ...



**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**

**1700 మంది పోలీసులతో పటిష్ట భద్రత.పోలీసులు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా విధులు నిర్వహించాలి .**

**నేడు నగరంలో ట్రాఫిక్ మళ్ళింపు.**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో మంగళవారం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ అన్నారు. ఈ సంధర్బంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ పేరెడ్ మైదానంలో బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**అందరూ భాధ్యతతో పని చేయాలన్నారు.** ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే పై అధికారులకు తెలియజేయాలన్నారు. శోభా యాత్ర జరిగే రహదారులు, కూడళ్లు, నిమజ్జనం వేళ ఎలాంటి ఘటనలు లేకుండా నిఘా ఉంచాలన్నారు.విధుల పట్ల అలసత్వం ప్రదర్శించ కూడదన్నారు. నిమజ్జన ఘాట్ల దగ్గర విధులు నిర్వహించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం పూర్తిగా ముగిసే వరకు విధులు కేటాయించిన స్థానాల్లోనే ఉండాలన్నారు.పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా భాద్యతగా ఉండి విధులు నిర్వహించాలన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో భక్తులు , ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యహరించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మీడియా తో మాట్లాడారు. కర్నూలు నగరంలో మంగళవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు తీసుకున్న చర్యలను వివరించారు. కర్నూలు నగరంలో 1,000కు పైగా గణేష్ విగ్రహాలు ఉన్నాయని, సాధారణంగా కర్నూలు నగరంలోని వినాయక్ ఘాట్‌లో నిమజ్జనం నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తక్కువగా ఉండటంతో వినాయక ఘాట్‌తో పాటు నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో అదనపు నిమజ్జన ఘాట్లను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు వన్‌టౌన్ పరిధిలోని రాంభొట్ల దేవాలయం పరిసరాల నుంచి నిమజ్జన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిమజ్జన మార్గాలు, ఘాట్ల వద్ద కలిపి సుమారు 1,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల, కడప, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు బందోబస్తు కొనసాగుతుం దన్నారు. నిమజ్జనానికి వచ్చే ప్రజలు పోలీసుల భద్రతా సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నన్నూరు, ఉలిందకొండ ప్రాంతాల్లో నీటి ప్రవాహం, నీటి లోతు ఎక్కువగా ఉన్నందున మరింత జాగ్రత్తగా ఉండాలని, నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించాలన్నారు.



పిల్లలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి కర్నూలు నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు అమల్లో ఉంటుందన్నారు. భారీ వాహనాలకు నగరంలో అనుమతి ఉండదని, అవసరాన్ని బట్టి ప్రధాన రహదారులపై వన్‌వే విధానం అమలు చేస్తామన్నారు. కొన్ని మార్గాల్లో ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సీ క్యాంప్ నుంచి ఎక్కువ సంఖ్యలో గణేష్ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడి నుంచి హైవే దాటి గణేష్ ఘాట్‌కు వచ్చే మార్గాల్లో ప్రత్యేక ట్రాఫిక్, భద్రతా చర్యలు చేపట్టామన్నారు. నిమజ్జన కార్యక్రమంలో నిబంధనలకు లోబడి డీజేలు నిర్వహించాలని, నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలన్నారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎఎస్పీ సుస్మిత ఐపియస్ , అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ డిఎస్పీలు, సిఐలు, ఆర్ ఐలు , ఎస్సైలు , ఆర్ ఎస్సైలు, సివిల్, ఎఆర్, ఎపిఎస్పీ, స్పెషల్ పార్టీ , హోంగార్డ్సు, కర్నూలు జిల్లా తో పాటు నంద్యాల, కడప, అనంతపురం జిల్లాల పోలీసులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేయాలి

**పార్టీ శ్రేణులకు మంత్రి జనార్దన్ రెడ్డి పిలుపు**



**కోవెలకుంట్ల సెప్టెంబర్ 21 నంది పత్రిక** క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులు నాయకులు ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు సోమవారము కోవెలకుంట్ల లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో ప్రజలతో సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**ఆటోనగర్‌కు స్థలం కేటాయించాలని మంత్రికీ కార్మికుల వినతి** అనంతరం కోవెలకుంట్లకు చెందిన పలువురు ఆటో కార్మికులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఆటోనగర్ ఏర్పాటుతో కార్మికులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, తమ వృత్తిని సక్రమంగా నిర్వహించుకునేందుకు అవకాశం కలుగుతుందని వారు వివరించారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సావధానంగా విని, ఆటోనగర్‌కు స్థలం కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## మురుగునీరు పోవడానికి మురుగు కాలువలను వెంటనే నిర్మించాలని

**సిపిఐ నగరసహాయ కార్యదర్శి దంభోళం శ్రీనివాసరావు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో మురుగునీరు పోవడానికి మురుగు కాలువలు నిర్మించాలని సోమవారం ఉదయం కలెక్టర్ ఆఫీస్ నందు కర్నూలు జాయింట్ కలెక్టర్ కి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నగర సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగినది ఈ సందర్భంగా స్థానిక సమస్య గురించి వివరిస్తూ 29వ వార్డులో సప్తగిరి కాలనీ బాలాజీ నగర్లలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్న ఇక్కడ సిసి రోడ్లు వేశారు కాలువలు మరిచారు అని కాలువలు లేక ఇక్కడ జనం చాలా ఇబ్బందులు పడుతున్నారని గత నాలుగు సంవత్సరాల నుండి మున్సిపల్ ఆఫీసు కలెక్టర్ ఆఫీసు సచివాలయం అన్ని చోట్ల తిరుగుతూ తిరుగుతూ విన్నవించుకుంటూ పోతున్నామని ఇక్కడ ఏమాత్రం పని జరగడం లేదని కొన్ని సందర్భాలలో ఏఈ సంబంధిత అధికారులు వచ్చి నెక్స్ట్ వారం వస్తాము పది రోజులు పడుతుంది నెల పడుతుంది అనిఇలా చెప్పుకుంటూ పోతూ ఉన్నారు కానీ ఇక్కడ చిన్న వర్షానికి మురుగునీరు రోడ్డు మీద నిలిస్తుంది సప్తగిరి కాలనీ వారి సమస్యలు ఇప్పటికైనా యుద్ధ ప్రతిపాదకన పరిష్కరించాలని అతి త్వరలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తే మరి పెండింగ్ పడుతుందని వివరించారు ఈ సమస్యను జాయింట్ కలెక్టర్ విని ఈ సమస్య గురించి తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారిలో ఏ ఆర్ కే నాయుడు రఘురాం రెడ్డి మొదలగువారు ఉన్నారు.

## నేడే కర్నూలు లో గణేష్ నిమజ్జనం..

**శోభాయాత్ర మార్గాలను కాలినడకన పర్యటించి పరిశీలించిన...**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** మంగళవారం కర్నూలు నగరంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జ నోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని రాంబొట్ల దేవాలయంలో కొలువైన గణపతిని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ దర్శించుకుని సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం రాంబొట్ల దేవాలయం నుంచి అమ్మవారి శాల వరకు ఎస్పీ కాలినడకన పర్యటించి, గణేష్ విగ్రహాల ఊరేగింపు, శోభాయాత్ర జరిగే మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశాలు జారీ చేశారు. నిమజ్జనోత్సవం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎస్పీ తో పాటు కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, మారుతి శంకర్, విక్రమ సింహ, శ్రీధర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## చాగలమర్రి లో ఈనెల 29న జాబ్ మేళా

**జాబ్ మేళా బ్రోచర్ను ఆవిష్కరించిన టిడిపి సీనియర్ నాయకులు భార్గవ రామ్**



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 21 నంది పత్రిక** ఏపీ స్టేట్ సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవరామ్ దంపతులు టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29న చాగలమర్రి ఎస్ వి ఆర్ట్స్ అండ్ కామర్స్ సైన్స్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించుచున్నారు. 10 కంపెనీలతో 125 ఉద్యోగాలతో జాబ్ మేళ నిర్వహించుచున్నారు ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నారు ఆళ్లగడ్డ నియోజకవర్గ నిరుద్యోగులు యువతి యువకులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కోరారు ఈ సందర్భంగా సోమవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు భార్గవ్ రామ్ ను ఏపీ స్టేట్ గవర్నమెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు ఆయనను కలిశారు అనంతరం బ్రోచర్ను ఆయన విడుదల చేశారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## నేక్‌నామ్ ఖాన్ కళాక్షేత్రం నామఫలకం ( నేమ్ బోర్డ్)వెంటనే పునఃస్థాపించాలి

**కడపలో నేక్‌నామ్ ఖాన్ గారి పేరుతో శాశ్వత స్మారక గుర్తింపు ఏర్పాటు చేయాలి**

**కడప నగర కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్**



కడప చరిత్రతో ముడిపడి ఉన్న నేక్‌నామ్ ఖాన్ గారి జ్ఞాపకాన్ని శాశ్వతంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సయ్యద్ గౌస్ పీర్ ఈరోజు ఐ=హా గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 17వ శతాబ్దంలో కుతుబ్‌షాహీ కాలంలో నేక్‌నామ్ ఖాన్ గారు కడప పట్టణ విస్తరణకు చాలా కృషి చేశారని, అదేవిధంగా కడపలో విద్యా-కళాబివృద్ధితో పాటు సామాజికంగా కడపకు ముందుకు తీసుకెళ్లారని గౌస్ పీర్ తెలిపారు. ఆయన కడపకు చేసిన సేవల వలన "నేక్‌నమాబాద్" అనే పేరు కడప చరిత్రలో ప్రస్తావించబడుతుందని తెలిపారు. మరమ్మతుల సమయంలో తొలగించిన "నేక్‌నామ్ ఖాన్ కళాక్షేత్రం" నామఫలకాన్ని వెంటనే పునఃస్థాపించాలని, అధికారుల అనుమతితో తన స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే కడపలో ఒక పార్కు, గార్డెన్, సర్కిల్ లేదా తగిన ప్రజా ప్రదేశానికి నేక్‌నామ్ ఖాన్ గారి పేరు పెట్టాలని కోరారు.తాను సమర్పించిన వినతిపత్రంపై ఐ=హా గారు సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కార బాధ్యతను ఖవీజకి అప్పగించడంతో పాటు, ఖవీజ కమిషనర్‌తో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని సూచించారని గౌస్ పీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగర ఉపాధ్యక్షులు అంజన్ కుమార్ మరియు డివిజన్ ఇంచార్జిలు మహబూబ్ భాషా,సిద్ధిక్,సయ్యద్ అన్వర్, మురాద్, గఫార్, ఆరిఫ్, సర్దార్ భాష, సుబ్రహ్మణ్యం, హాజీ భాయ్, గౌరీ దేవి, హమీదా ఖానం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ముఖ్యమంత్రి చే పట్టణ మౌళిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

### కమిషనర్ ఎం.జయకృష్ణ.

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టణ మౌళిక అభివృద్ధికి హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ ( హెచ్ ఏ ఎం) పథకం కార్యక్రమాన్ని మంగళవారంకుప్పం నుండి విరుచ్యువల్ గా ప్రారంభిస్తారని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ పట్టణ స్థానిక సంస్థల్లో ( యు ఎల్ బి ఎస్) పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి కి 7,469 కోట్ల రూపాయల పరిపాలనా అనుమతిని మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో తిరుపతి నగరపాలక సంస్థకు 106 కోట్లు కేటాయించిందని తెలిపారు. హెచ్ ఏ ఎం కార్యక్రమం ద్వారా తిరుపతి నగరంలో రహదారులు, ట్రాఫిక్, కనెక్టివిటీ, వీధి దీపాలు, మీడియన్లు మరియు పార్కుల అభివృద్ధి చేయనున్నారు. దీంతో పట్టణ మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయని తెలిపారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళా విశ్వావిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం నందు మంగళవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్నారని తెలిపారు.



## వేములపాడులో సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్లను ప్రారంభించిన మంత్రి




**అవుకు సెప్టెంబర్ 21నందిపత్రిక** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అవుకు మండలం వేములపాడు గ్రామంలో రూ.25.00 లక్షల వ్యయంతో పూర్తిచేసిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను సోమవారం మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో గ్రామంలోని అంతర్గత ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యంతో పాటు, సైడ్ డ్రెయిన్ల ఏర్పాటుతో వర్షపు నీరు, మురుగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను దశలవారీగా బలోపేతం చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.వేములపాడు గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టేందుకు కృషి చేస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.

# 'ఇక్రా' పాఠశాలలో మళ్లీ అదే దుస్థితి.. రేకుల షెడ్లలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి!




**గదిలో ఒకే ఫ్యాన్‌తో తరగతులు**

**అస్వస్థతకు గురై మ్యాథ్స్ టీచర్ రుబీనా పాఠశాల వీడినట్లు సమాచారం.**

**గత కథనంపై యాజమాన్యం, అధికారుల స్పందన శూన్యం..**

**"పెద్దల పరిస్థితి ఇలా ఉంటే చిన్నారుల పరిస్థితి ఎలా?"**

**వెలుగోడు, సెప్టెంబర్ 21 (నంది పత్రిక)**:విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో విద్య అందించాల్సిన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంపై గతంలో నంది పత్రిక ప్రచురించిన కథనంపై పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారులు తగిన విధంగా స్పందించారు. వెలుగోడు పట్టణంలోని 'ఇక్రా' ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రేకుల షెడ్ల కింద తరగతులు నిర్వహించడం, సరైన గాలి ప్రసరణ లేకపోవడం, పరిమిత సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు కొనసాగుతున్నాయి.తాజాగా పాఠశాలలో నిర్వహిస్తున్న మ్యాథ్స్ టీచర్ రుబీనా రేకుల షెడ్లలోని తరగతి తీవ్ర ఉక్కపోత, సరైన గాలి ప్రసరణ లేకపోవడం, ఒకే ఫ్యాన్‌తో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి కారణంగా అస్వస్థతకు గురై పాఠశాల వైదొలిగినట్లు సమాచారం. ఒక ఉపాధ్యాయురాలే ఆ వాతావరణాన్ని తట్టుకోలేక పాఠశాలను వీడాల్సిన పరిస్థితి, గంటల తరబడి అదే గదిలో కూర్చునే చిన్నారుల పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ప్రశ్నలు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి.రేకుల షెడ్లలో తరగతులు.. ఉక్కపోతతో ఇబ్బందులు

పాఠశాలల్లో కొన్ని తరగతులు రేకుల షెడ్లలో పెరుగుతాయని, ఎండ తీవ్రత సమయంలో రేకులు వేడెక్కడంతో తరగతి గదుల్లో ఉక్కపోత ఎక్కువగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి ప్రసరణకు తగిన ఏర్పాట్లు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గది మొత్తానికి ఒకే ఫ్యాన్ ఉంటే, చిన్నారుల ఆరోగ్యం, ఏకాగ్రతపై దాని ప్రభావం ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఆటస్థలం.. ప్రాథమిక సౌకర్యాలు ఎక్కడ?** పాఠశాలలో తగినంత ఖాళీ స్థలం, ఆటల కోసం సరైన మైదానం, తరగతి గదుల్లో గాలి ప్రసరణ వంటి మౌలిక సదుపాయాలపై గతంలోనే ప్రశ్నలు తలెత్తాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, ఫ్యాన్లు, గాలి ప్రసరణ, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి వాటిని అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.గత కథనంపై స్పందన ఏది? ఇదే అంశంపై గతంలో నంది పత్రిక పాఠశాల పరిస్థితులపై కథనాన్ని ప్రచురించింది. రేకుల షెడ్లలో తరగతులు, ఇరుకు గదులు, ఆటస్థలం లేకపోవడం, విద్యార్థులకు సరైన గాలి సరఫరా వంటి అంశాలు కథనం ద్వారా వెలుగులోకి వచ్చాయి. అయితే ఆ కథనం అనంతరం పాఠశాల యాజమాన్యం నుంచి సరైన స్పందన రాలేదని, విద్యాశాఖ అధికారులు కూడా సమస్యను పూర్తి స్థాయిలో పరిశీపరిస్థితి తల్లిదండ్రులు వాపోతున్నారు.అప్పటి సమస్యలు కాకుండా ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**"పెద్దల పరిస్థితి ఇలా ఉంటే.. పిల్లల పరిస్థితి ఎలా?"**

"ఉపాధ్యాయులే గాలి లేక అస్వస్థతకు సరైన పరిస్థితి ఉంటే, చిన్నారులు రోజంతా అదే గదుల్లో ఎలా ఉంటారు? పిల్లల ఆరోగ్యం దెబ్బతిన్న తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు పరిస్థితిని పరిశీలించాలి" అని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒక ఉపాధ్యాయురాలు ఉక్కపోతను తట్టుకోలేక పాఠశాలను వీడినట్లు సమాచారం వెలువడుతున్న నేపథ్యంలో, అదే వాతావరణంలో చదువుకుంటున్న చిన్నారుల పరిస్థితి ఒక్కసారి ఊహించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**విద్యాశాఖ అధికారులు తక్షణమే పరిశీలించాలి**

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, తరగతి గదుల విస్తీర్ణం, గాలి ప్రసరణ, విద్యుత్ ఫ్యాన్ల సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం, అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు తదితర ప్రాథమిక సౌకర్యాలను సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిబంధనల ప్రకారం పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా లేదా అన్నది అధికారులు స్పష్టంగా నిర్ధారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు వారి పరిస్థితికి కారణం కాకూడదని, 'ఇక్రా' పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## బండి ఆత్మకూరు ఎత్తిపోతల వద్ద అధికారుల హై డ్రామా



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 21:** బండి ఆత్మకూరు ఎత్తిపోతల పథకం వద్ద ఆ శాఖకు చెందిన అధికారులు హై డ్రామా సృష్టించారు. గత కొద్ది నెలల క్రితం నుండి ఎత్తిపోతల పథకానికి సంబంధించి రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. ఎత్తిపోతల శాఖకు చెందిన అధికారులు కొందరు సోమవారం 6 గంటల ప్రాంతంలో హడావుడిగా రైతులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడికి వచ్చిన కొంతమంది రైతులతో పాటు కౌలు రైతులతో సంతకాలు చేసే కార్యక్రమానికి పూనుకున్నారు. అక్కడికక్కడే తీర్మానం రాసి ఎత్తిపోతల పథకాన్ని గ్రామంలో ఒక వర్గానికి చెందిన నాయకులకు ఎత్తిపోతల పథకాన్ని లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు అప్పగించారు. చాలా రోజుల నుండి ఎత్తిపోతల పథకం విషయంలో చర్యలు తీసుకోమని రైతులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. చెప్పా పెట్టకుండా వచ్చిన ఎత్తిపోతల అధికారులు, సోమవారం రాత్రి చీకటి పడే సమయంలో రైతుల సమక్షంలో ఎత్తిపోతల పథకానికి సంబంధించి తాళాలు పగలగొట్టారు. ఎత్తిపోతల నిర్వహణకు సంబంధించి అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించి కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నిబంధనలను కాదని కౌలు రైతులతో సంతకాలు సేకరించడంలో ఎత్తిపోతల అధికారుల ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని కొందరు రైతులు చర్చించుకుంటున్నారు. తాళాలు పగలగొట్టి ఎత్తిపోతల అధికారులు ప్రవర్తించిన తీరుపై రైతులు తిక్కన మక పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ ను వివరణ కోరే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన స్పందించలేదు. ఆఖరి క్షణంలో ఓ కింది స్థాయి అధికారి ఈ విషయంపై స్పందించారు. ఎత్తిపోతల వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు రైతులకు ముందుగానే తెలియపరచడం జరిగిందని చెప్పుకొచ్చారు.

# గురజాడ.. సామాజిక మార్పునకు స్ఫూర్తిజాడ..




**- తెలుగు సాహిత్యానికి ఆధునిక దిశను చూపిన మహనీయుడు**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక**

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి ప్రజలకు ఆధునిక దిశను చూపడంతో పాటు, తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహనీయుడు గురజాడ అప్పారావు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురజాడ రచనలు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలపై ఆలోచింపజేసి మార్పు వైపు నడిపించాయని పేర్కొన్నారు. నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి గురజాడ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ రచనలు సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలపై ఆలోచన రేకెత్తిస్తూ ప్రజల్లో మార్పు కోసం స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అనే గురజాడ సందేశం దేశం, సమాజం పట్ల ప్రతిఒక్కరికీ ఉన్న బాధ్యతను గుర్తుచేస్తోందన్నారు. గురజాడ సాహిత్య స్ఫూర్తితో యువత మానవతా విలువలు, సామాజిక బాధ్యత, సమాజ అభ్యున్నతి పట్ల నిబద్ధతను పెంపొందించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## ఏబీయం పాలెం లో పర్యటించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య.

**నందికొట్కూరు సెప్టెంబర్ 21(నంది పత్రిక** )పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ఎబిఎం పాలెంలో వార్డు విజిట్ కార్యక్రమంలో కాటేపోగు రాజ్ కుమార్,కళాకర్, బొల్లెద్దుల్లారాజన్న, రాజేష్,నాగ సురేష్, జాను,నిమ్మకాయ ల రాజు, ప్రేమ్ కుమార్ ల ఆధ్వర్యంలో టిడిపి పట్టణ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ముర్తు జావలి ల, టిడిపి నాయకులు లాయర్ జాకిర్ హుస్సేన్,కమిషనర్ వెంకట్రామిరెడ్డి తో కలసి శాసనసభ్యులు గిత్త జయసూర్య పర్యటించారు.ఈ సందర్భంగా వార్డులోని రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు మరియు ఇతర మౌలిక వసతులపై స్థానిక ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు.

**ఎమ్మెల్యే ను సన్మానించిన టీడీపీ నాయకులు రాజ్ కుమార్ :** వార్డు పర్యటన కు విచ్చేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య ను స్థానిక ఏబీయం పాలెం టిడిపి నాయకులు 2 వార్డు ఇంచార్జ్ రాజకుమార్ (సన్నీ ) శాలువా తో పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఈ నాజిర్, ఏఈ దినేష్ కుమార్ , ఏబీయం పాలెం యువ నాయకులు లాలు ప్రేమ్, చిన్న వంశీ, ప్రవీణ్ రగడ మరియు సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సరైన పునాది పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణ





## ప్రతి చిన్నారికి సమతుల్య ఆహారం అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు సరైన పునాది పోషకాహారం, ప్రేమతో కూడిన సంరక్షణేనని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.చిన్నారులకు బాల్యం నుంచే సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పోషణ ఆహారం తగినంత ప్రోటీన్ సమాజ భాగస్వామ్యం అనే అంశంపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోషణ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు.స్టాల్‌లో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితరాలను పరిశీలించారు. వాటి పోషక విలువలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 9వ తేదీ నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషకాహార మహోత్సవాలు కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మన పోషణ మన కుటుంబానికి బలం అనే భావన ప్రతి కుటుంబంలో పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు, ప్రోటీన్‌తో కూడిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కాలానుగుణంగా లభించే స్థానిక ఆహార పదార్థాలను వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతోనే కుటుంబానికి అవసరమైన పోషకాలను అందించవచ్చని తెలిపారు.పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకునేలా కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పోషణతో ఆరోగ్యం అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆరోగ్యకరమైన బాల్యం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతో పాటు, పోషకాహార లోపాన్ని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.బిడ్డ పుట్టినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు బిడ్డ శారీరక, మానసిక, మెదడు ఎదుగుదలకు అత్యంత కీలకమైనవని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కాలంలో తల్లి, బిడ్డకు తగిన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రేమతో కూడిన సంరక్షణ అందించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఆరు నెలలు పూర్తయిన తరువాత వయస్సుకు తగిన అదనపు ఆహారాన్ని క్రమంగా పరిచయం చేయాలని సూచించారు. బిడ్డ ఎంత తింటోంది, బిడ్డ బరువు, ఎదుగుదల ఎలా ఉంది అనే విషయాలను అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని అన్నారు.బిడ్డ ఎదుగుదలను తెలుసుకోవాలంటే బిడ్డ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలించాలి. ప్రతి చిన్నారికి సరైన పోషణతో పాటు ప్రేమ, ప్రేరణ, శ్రద్ధ అవసరం" అని కలెక్టర్ పేర్కొన్నారు.

**అంగన్వాడీ కేంద్రాలు సమాజ భాగస్వామ్యంతో పోషణ ఉద్యమం**మన అంగన్వాడీ మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, ఆరోగ్య సేవలు, బాలల ఎదుగుదల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పోషకాహార లోపం ఉన్న పిల్లలను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన వైద్య, పోషకాహార సేవలు అందేలా అంగన్వాడీ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో పోషకాహారం పై అవగాహన పెంచేందుకు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు.పోషకాహారం శారీరక ఎదుగుదలకు మాత్రమే కాకుండా మెదడు ఎదుగుదలకు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు.ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలను అర్హులైన ప్రతి కుటుంబం వినియోగించుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి డి శ్రీలక్ష్మి, డిస్టిక్ కో ఆర్డినేటర్ పి. చంద్రశేఖర్ , నోడల్ అధికారి విజయలక్ష్మి, సి డి పి ఓ లు, సూపర్వైజర్లు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

## జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేయండి



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 21. (నంది పత్రిక ):**జర్నలిస్టుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేయాలని మంత్రి ఎంఎండి ఫరూక్ను ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా కమిటీ సభ్యులు సోమవారం మంత్రి కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించి తమ కోరికలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిబాబు సాగర్, కోశాధికారి మస్తాన్, బ్రాడ్ కాస్టింగ్ నాయకులు శివరామకృష్ణ, మౌలాలి, ఇ.వి.రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.మహాకవి శ్రీ గురజాడ వెంకట అప్పారావు జయంతి

## చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** మహాకవి శ్రీ గురజాడ వెంకట అప్పారావు జయంతి సందర్భంగా పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు . శ్రీ గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ..**కీ, శే,,గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో వ్యావహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు, తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించారని పేర్కొన్నారు. 'కన్యాశుల్కం' వంటి రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో ఆలోచనా మార్పుకు దోహదపడ్డారని తెలిపారు. తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి శ్రీ గురజాడ అప్పారావు అందించిన సేవలు చిరస్మరణీయమని, "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే ఆయన సందేశం సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తుందని పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలకొల్లు డిగ్రీ కాలేజ్ నందు సెప్టెంబర్ 26 న నిర్వహించే మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ ను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరము నందు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ తో పాటు డి ఆర్ ఓ పి గ్లోరియా, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై దోసిరెడ్డి, డ్వామా పిడి డా కె సి హెచ్ అప్పారావు, కలెక్టరేట్ ఏఓఎస్ వెంకటేశ్వరరావు,చేతుల మీదుగా మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే బి ఆర్ ఆర్& జి కే ఆర్ ఛాంబర్ డిగ్రీ కాలేజ్ నందు ఈ నెల 26వ తారీఖున మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో సుమారు 20 ప్రముఖ కంపెనీలతో పాటు, మరికొన్ని ఇతర కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ కంపెనీలలో మొత్తం 1500 లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, 18 – 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులన్నారు. కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఈ లింక్ నందు ష్ట్రజూం://ఖుఱజూబఱఖుఎ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఇతర వివరములకు ఈ క్రింది నెంబర్ల నందు సంప్రదించాలని తెలిపారు. మనోజ్-6304922617నాగేంద్ర -9502024765ప్రసన్న -7013896277 ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా .పి.లోకమాన్, నేషనల్ కెరియర్ సర్వీస్ ఎం. కిషోర్ రెడ్డి, ఛాంబర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. .

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి




**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో పి జి ఆర్ ఎస్ లో రాష్ట్రంలో మిగిలిన జిల్లాల కన్నా పశ్చిమగోదావరి జిల్లా అత్యుత్తమ పనితీరు కనబరిచింది....ప్రజల అర్జీల స్వీకరణ నుంచి సమస్యల పరిష్కారం వరకు సమర్థవంతమైన పర్యవేక్షణకు జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అభినందనలు తెలిపారు. అమరావతిలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరించడంలో జిల్లా యంత్రాంగం కనబరిచిన అత్యుత్తమ పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. పీజీఆర్ఎస్ నిర్వహణలో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి మంచి పనితీరు కనబరిచిందని ముఖ్యమంత్రి అభినందించడం జిల్లాకు గర్వకారణం అని అధికారులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు డిఆర్ఓ పి గ్లోరియా, జిల్లా పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కె సిహెచ్ అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధికారి వెంకటలక్ష్మి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు అందరూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ను ప్రశంసిస్తూ, పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యలకు పరిష్కారం చూపేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్ చురుకైన విధానాన్ని అవలంబించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు పీజీఆర్ఎస్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలిచేలా జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. అర్జీల స్వీకరణకు మాత్రమే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను బాధ్యులను చేయడం, పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించడం వంటి చర్యలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా జిల్లా యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్నారు.పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా అధికారులు పనిచేసే విధంగా జిల్లా కలెక్టర్ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా మంచి ఫలితాలను సాధిస్తూ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లా అధికారులకు మరింత బాధ్యతలు పెరిగాయని, ఇదే స్ఫూర్తితో ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆమె అధికారులు అన్నారు. సీఎంవో నుంచి అందిన ఫిర్యాదులపై కూడా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడటంతో పాటు, అవసరమైన సందర్భాల్లో వారితో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకుని, త్వరితగతిన పరిష్కారం లభించేలా చొరవ చూపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని, పీజీఆర్ఎస్ పనితీరుకు మరింత బలం చేకూర్చాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## గురజాడ అప్పారావు సాహిత్య సేవలు చిరస్మరణీయం

### జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ పీజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. తన రచనల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలు, అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. సమాజ అభ్యున్నతికి సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని తన రచనల ద్వారా గురజాడ చాటిచెప్పారని అన్నారు.దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే గురజాడ సందేశం ప్రజల్లో దేశభక్తి, మానవతా విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించేలా ఉందని పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడంలో గురజాడ అప్పారావు చేసిన కృషి విశేషమైనదన్నారు.ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తూ సమాజంలో సమానత్వం, మానవత్వం, మహిళా గౌరవం, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. యువత గురజాడ వెంకట అప్పారావు సాహిత్యాన్ని చదివి, ఆయన ఆశయాలను తెలుసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పి. గ్లోరియా, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏ. వెంకట అప్పారావు,పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి,డ్వామా పిడి డా. కె సి హెచ్ అప్పారావు, జిల్లా సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి. మోహన్ రాజు, జిల్లా స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధికారి ఏ .వెంకటలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.సునీత, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి పిచ్చయ్య, కలెక్టరేట్ ఏ ఓ ఎన్.వెంకటేశ్వరరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, నాణ్యత, శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం







## పి జీ ఆర్ ఎస్ లో 208, రెవెన్యూ క్లినిక్‌లో 78 దరఖాస్తుల స్వీకరణ

## ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పరిష్కరించాలి.

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** జిల్లాలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించి, వేగవంతంగా, నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి .గోరియా, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి, డ్వామా పి డి డా. కె సి హెచ్ అప్పారావు, కలెక్టరేట్ ఏ ఓ ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించి ముగింపు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యం, అలసత్వానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను తెలుసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు ఒకే సమస్యపై పదేపదే దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత దరఖాస్తుదారుకు సమాచారం అందించడంతో పాటు సమస్య పూర్తిగా పరిష్కారమైందో లేదో కూడా ధృవీకరించాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 208, దరఖాస్తులు రెవెన్యూ క్లినిక్‌లో 78 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నరసాపురం మండలం సరిపల్లి గ్రామం నుండి బండి పెద వెంకటేశ్వరరావు, తనకు పక్షవాతం వచ్చి కాళ్లు చేతులు పనిచేయడం లేదు మంచానికి పరిమితమై ఉన్నాను మందులు ఖర్చులకు డబ్బులు చాలటం లేదు ప్రభుత్వం అందిస్తున్న 6 పింఛను బదులు గా 15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. వీరవాసరం మండలం పడమటి పాలెం గ్రామం నుండి పంపన రామకృష్ణ తనకు 92 సెంట్లు భూమికి గాను ఆన్లైన్లో 89 సెంట్లు మాత్రమే నమోదు అయినది సర్వే చేయించి హద్దులు చూపాలని కోరారు. తణుకు మున్సిపాలిటీ 16వ వార్డు వెంకట్రాయపురం నుండి కొణతల శివాజీ రామస్వామిరెడ్డి, విభిన్న ప్రతిభావంతుడను నడవలేని పరిస్థితిలో ఉన్నాను వైద్యం కొరకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాను ప్రభుత్వం నుండి మూడు చక్రముల బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ మేకల ఏడుకొండలు పట్టణంలో 32 వార్డు యానాది కాలనీలో సుమారు 50 మంది చిన్నపిల్లలు ఉన్నారు. వారు అంగన్వాడి కేంద్రం వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం ఉన్నది కాలనీలో అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పెనుగొండ మండలం గట్టాల దిబ్బ గ్రామం బొక్క సుబ్బలక్ష్మి ఒంటరి మహిళ పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకున్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామం నుండి ఎం యాకోబు మా కాలనీకి ఆనుకుని స్మశాన వాటిక ఉన్నది రాత్రి సమయంలో కాలనీకి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు స్మశాన వాటికి ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ నెంబరు మేడం దుర్గాప్రసాదు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది..

## వాసవి మార్కెట్‌లో శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నందిపత్రిక** నందిగామ పట్టణంలోని వాసవి మార్కెట్‌లో నిర్వహించిన శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భక్తులు, మహిళలు, కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించి, కళ్యాణ మహోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ, నందిగామ నియోజకవర్గంలో ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించే కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, ప్రతి కార్యక్రమంలో భాగస్వామిగా ఉంటూ నందిగామ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శిశు గృహ సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలికలకు చట్టబద్ధంగా దత్తత

## దత్తత ప్రక్రియలో అన్ని నిబంధనలు, ధ్రువపత్రాల పరిశీలన

## బాలికల ఆరోగ్యం, భద్రత, విద్యకు ప్రాధాన్యత

## జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21, నంది పత్రిక** జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత సంస్థ శిశు గృహంలో సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలికలకు సోమవారం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను చేపట్టారు. దత్తత ప్రక్రియలో భాగంగా బాలికల గుర్తింపు వివరాలు, దత్తత తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, సంబంధిత ధ్రువపత్రాలు, పత్రికా ప్రకటన, ఇతర అవసరమైన రికార్డులను పరిశీలించారు. దత్తత ప్రక్రియలో అన్ని చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బాలికల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన వైద్య పరీక్షలు, ఆరోగ్య రికార్డులపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలికల ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను దత్తత తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. బాలికలను ప్రేమతో, బాధ్యతతో పెంచాలిదత్తత తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, బాలికలను ప్రేమతో, బాధ్యతతో పెంచాలని సూచించారు. వారి ఆరోగ్యం, పోషణ, విద్య, భద్రత, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన, ప్రేమపూర్వకమైన కుటుంబ వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. దత్తత అనంతరం బాలికలకు కన్నబిడ్డతో సమానంగా హక్కులు, బాధ్యతలు, కుటుంబ సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలకు సురక్షితమైన కుటుంబ వాతావరణం, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి యమ్. రాజేశ్వరరావు, లీగల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, శిశు గృహ మేనేజర్ దీపిక, సోషల్ వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు..

# కూటమి పాలనలో పండుగలకు కొత్త కళ

## టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పండుగలు, ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల భాగస్వామ్యంతో ఎంతో ఘనంగా జరుగుతున్నాయని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు.సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పటమట కర్ణం గారి బజారులో బద్రి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో గద్దె క్రాంతి కుమార్ పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తూ ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించుకునేందుకు అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. ప్రజల సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించే పూజలు, అన్నసంతర్పణ వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని అన్నారు. వినాయకుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్న బద్రి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులను ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ అభినందించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమంలో 7 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.



# గతంకంటే ఘనంగా దసరా మహోత్సవాలు

- సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ఏర్పాట్లు
- ఉచిత దర్శనాలతో పాటు ప్రసాదాల పంపిణీ
- ఏఐ సాంకేతికత అనుసంధానంతో భక్తుల భద్రతకు భరోసా
- ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతర పర్యవేక్షణ
- 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)
- సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** అక్టోబర్ 10 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం శ్రీ పరాభవనామ సంవత్సర దసరా మహోత్సవాలను గతంలో కంటే ఘనంగా, భక్తులకు మరింత సౌకర్యవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు తెలిపారు. ఏఐ సాంకేతికతను అనుసంధానం చేసి భక్తుల భద్రతకు మరింత భరోసా కల్పించడంతో పాటు, ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి దర్శనం త్వరగా, సౌకర్యవంతంగా లభించేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుంటూ చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఏఐ ఆధారిత ప్రత్యేక మొబైల్ అప్లికేషన్, అందుబాటులో ఉన్న సేవలను పరిశీలించారు. క్యూలైన్లోని భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలియజేసేలా ప్రతి 200 మీటర్లకు చేస్తున్న ఏర్పాట్లతో పాటు డిజిటల్ స్క్రీన్లు, ఏఐ కెమెరాలు, డ్రోన్ల సేవలు తదితరాలపై చర్చించారు. 22 పార్కింగ్ ప్రాంతాలతో మూడు హోల్డింగ్ ఏరియాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చేస్తున్న ఏర్పాట్లతో పాటు స్మార్ట్ లడ్డూ వెండింగ్ మెషీన్ల ఏర్పాటుపైనా చర్చించారు. ఈ సందర్భంగా కె.కన్నబాబు మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, దర్శన మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉచిత దర్శనాల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, భక్తులకు ప్రసాదాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణను సమన్వయం చేసేందుకు దుర్గాఘాట్ సమీపంలో 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుండగా.. క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ, తక్షణమే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలపై కూడా వేగంగా స్పందించేలా చొరవ చూపాలన్నారు. సామాన్య భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు, జనరల్ పబ్లిక్‌కు ప్రత్యేక దర్శనాలకు చేస్తున్న ఏర్పాట్లు, వివిధ రకాల పాస్‌ల జారీ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు బ్యాటరీ వాహనాల ఏర్పాటు, అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదం పంపిణీ తదితరాలకు చేస్తున్న ఏర్పాట్లను ఆలయ అధికారులు వివరించారు. ఖడ్గమాల, కుంకుమార్చణ, చండీహోమం సేవలకు చేస్తున్న ఏర్పాట్లను కూడా వివరించారు. అదేవిధంగా నివేదనలు, ప్రత్యక్ష, పరోక్ష సేవల గురించి వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించే విధులకు సంబంధించి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు. మొత్తంమీద 20 లక్షల వరకు భక్తులు వచ్చినా ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల భద్రతకు చేస్తున్న ఏర్పాట్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్ గురించి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వివరించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలకు సంబంధించి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. అక్టోబర్ 16 మూలానక్షత్రం రోజున సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఆలయానికి రానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు ఎల్.దుర్గా ప్రసాద్, కె.రవికుమార్, ఆలయ ఈఈలు ఎల్.రమాదేవి, బి.రాంబాబు, డీవీ భాస్కర్, ఏఈవో ఎన్.రమేష్ బాబు, డా. కె.గంగాధర్, పి.చంద్రశేఖర్, వీఎంసీ చీఫ్ఇంజనీర్ పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



# కూటమి హయాంలో గ్రామాల్లో మౌళిక సదుపాయాలకు మహర్దశ

## రూ.10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణాల కు భూమిపూజ

## రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 21 నంది పత్రిక** గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతిస్తుందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం జడ్డంగి, రేవటిపాలెం గ్రామాల్లో ఆమె ఏపీఐఐసీ డైరెక్టర్,మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఆమెకు ఆయా గ్రామాల్లో కూటమి ఎన్డీఏ శ్రేణులు ఘన స్వాగతం పలికారు . అనంతరం ఆమె జడ్డంగిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్ళే దారిని సిమెంట్ రోడ్డు మంజూరు చేశారు. రూ;5 లక్షల వ్యయంతో చేపట్టే ఆయా నిర్మాణానికి మరియు రేవటిపాలెం గ్రామంలో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా సిమెంట్ రోడ్ల నిర్మాణాలను స్థానిక కూటమి శ్రేణులు పూర్తి నాణ్యతగా చేయించు కోవాలని సూచించారు. గుత్తేదారులు కూడా సకాలంలో ఆయా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి , స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు, ఏపీఐఐసీ డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభాన ఏఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, సీనియర్ నాయకులు దంతులూరి శివరామ చంద్రరాజు, గణజాల తాతారావు, నియోజకవర్గ మహిళా నాయకులు ముప్పన సావిత్రి, రాజవొమ్మంగి జడ్పీటీసీ జ్యోతి, డైరెక్టర్లు గట్టి మాణిక్యం, కేశిరెడ్డి శివ శంకర వర ప్రసాద్, గంగవరం సొసైటీ అధ్యక్షులు పాము అర్జున్, రాష్ట్ర రైతు విభాగం నాయకులు కనిగిరి రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి గంగాధర్, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బారంగి అనుదీప్, చెక్క పండు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# సమాజ సంస్కరణకు గురజాడ రచనలు చిరస్థాయి స్ఫూర్తి

**గురజాడ ఆశయాలను ఆచరణలో పెడదాం - ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేద్దాం**

**తరతరాలకు స్ఫూర్తినిచ్చే మహాకవి గురజాడ - ఘనంగా 164వ జయంతి వేడుకలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21(నంది పత్రిక):-** మహాకవి గురజాడ వెంకట అప్పారావు సాహిత్యం నేటికీ సమాజంలో చైతన్యం, సంస్కరణలకు స్ఫూర్తినిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గురజాడ రచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గురజాడ రచించిన 'కన్యాశుల్కం', 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' వంటి రచనలు బాల్య వివాహాలు, సామాజిక రుగ్మతలు, మహిళల సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించాయని కలెక్టర్ తెలిపారు. విజయనగరం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, అక్కడ గురజాడ 150వ జయంతి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహించే అవకాశం తనకు లభించిందన్నారు. గురజాడపై సేకరించిన సమాచారంతో కవులు, రచయితల వ్యాసాలతో పుస్తకాలను రూపొందించి గ్రంథాలయాలకు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. దేశమును ప్రేమించుమన్నా' గేయంలోని సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని, ముఖ్యంగా ముందుకు సాగాలనే గురజాడ ఆశయం పరిపాలనలోనూ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అన్నారు. గతంలో పనులు జరగలేదని నిరుత్సాహపడకుండా, అనుభవాలను పాఠాలుగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా నిస్వార్థంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, జిల్లాధికారులు, సిబ్బంది పాల్గొని గురజాడ అప్పారావుకు ఘనంగా నివాళులర్పించారు.

## పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమగ్ర కార్యాచరణ**

**అధికారులు శాఖల వారీగా పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి - కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21(నంది పత్రిక):-** జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, గృహనిర్మాణం, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగం తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద మొదటి త్రైమాసిక వ్యయాన్ని 100 శాతం బుక్ చేసి, తదుపరి నిధుల వినియోగానికి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ డిసెంబర్ నాటికి గణనీయమైన పురోగతి సాధించాలని ఆదేశించారు. పీఎం సెట్ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమల ద్వారా ఐటీఐల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి మంజూరైన పార్కుల్లో రోడ్లు, నీరు, పైప్‌లైన్లు తదితర మౌలిక వసతుల పనులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి జిల్లాలో నిలిచిపోయిన, అసంపూర్తిగా ఉన్న సుమారు 15 వేల గృహాలను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. టిడ్కో ఇళ్ల పనులను వేగవంతం చేసి, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి హెల్త్ రిసార్ట్స్, రెవెన్యూ సైట్లు, రోడ్‌సైడ్ సౌకర్యాలకు సంబంధించిన భూ ప్రతిపాదనలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో నంది ఫెస్టివల్, బెలూం ఫెస్టివల్ వంటి స్థానిక ఉత్సవాలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలంలో శాశ్వత హెలిప్యాడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రానికి హెలిపోర్ట్ లేని నేపథ్యంలో హెలిపోర్ట్ కోసం 10-15 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జలధార ఫేజ్-2 పనులతో పాటు మొక్కల పెంపకం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్ పిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, అమృత్ మరియు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అధికారుల సమన్వయంతో నీటి వనరులను సుందరీకరించాలని సూచించారు. అటవీ శాఖ నర్సరీల అభివృద్ధి, ఆటిజం సెంటర్ల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు, వన్‌స్టాప్ సెంటర్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేయాలని పిలుపు నిచ్చిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి...



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 21 ( నంది పత్రిక )** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాల గడ్డపై వైసీపీ జెండా ఎగురవేద్దామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణం అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ నందు నేటి సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అనంతరం వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో... ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, వైసీపీ నంద్యాల నియోజకవర్గ పరిశీలకులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైసీపీ నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, మండల నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన కూటమి నాయకులు, నేడు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అటకెక్కించారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా, తాగు, సాగునీరు ఇవ్వలేని అసమర్థ స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేయడానికి సమిష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు.




# 25 న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**

**నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనతను తగ్గించడంతో ఆరోగ్యకరమైన శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుంది**

**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 21(నంది పత్రిక):-** : సెప్టెంబర్ 25వ తేదీన జిల్లావ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డెవర్మింగ్ డే) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. సోమవారం ఉదయం పీ జీ ఆర్ఎస్ హాలు నందు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డెవర్మింగ్ డే ) పై జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదా బాయి, జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల సమగ్ర శారీరక, మానసిక ఎదుగుదలకు, ఆరోగ్యకరమైన బాల్యానికి నులిపురుగుల నివారణ ముఖ్యమైందనీ,ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు ఐదు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖ, మున్సిపల్ పరిపాలన శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుని అర్హులైన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 4613 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలు డిగ్రీ కళాశాల పరిధిలోని సుమారు 4,46400 మంది పిల్లలు విద్యార్థులకు నివారణ మాత్రలు అందించడమే కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు 200 మి.గ్రా. సగం మాత్రను బాగా పొడి చేసి, నీటిలో కలిపి తాగించాలి. 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు 400 మి.గ్రా. నమిలి మింగేలా చూడాలన్నారు. ఖాళీ కడుపుతో కాకుండా భోజనం చేసిన తర్వాత మాత్రమే మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. నులు పురుగులు నివారణ మాత్రమే తీసుకోవడంతోపాటు పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఆయా విద్యా సంస్థలు పంపిణీ చేసిన మాత్రల వివరాలను ఏఎన్ఎం, ఎంపీడీవో లాగిన్ లో కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు లేదా అంగన్‌వాడీ కార్యకర్తల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే పిల్లలకు అక్కడికక్కడే మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు తీసుకున్న అనంతరం పిల్లల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించేందుకు అవసరమైన వైద్య సిబ్బంది, వైద్య పరీక్షల సౌకర్యాలు అందుబాటులో ఉండాలని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు సాధారణంగా సురక్షితంగా ఉపయోగించబడుతున్నప్పటికీ, నులిపురుగుల భారం ఎక్కువగా ఉన్న కొంతమంది పిల్లల్లో మాత్ర తీసుకున్న అనంతరం స్వల్పంగా వికారం, కడుపునొప్పి లేదా వాంతులు వంటి అసౌకర్యాలు కనిపించే అవకాశం ఉందని తెలిపారు. అలాంటి సందర్భాల్లో భయపడకుండా వెంటనే అక్కడి వైద్య సిబ్బందినీ సంప్రదించాలన్నారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనతను తగ్గించడంతో పాటు పోషకాహార స్థితి, ఏకాగ్రత మరియు ఆరోగ్యకరమైన శారీరక ఎదుగుదలకు తోడ్పడుతుందని అధికారులు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలకు సెప్టెంబర్ 25న నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా పూర్తి సహకారం అందించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయి అధికారులు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని మధ్యాహ్న భోజనం సమయంలో స్వయంగా పాల్గొని పిల్లలందరికీ నులు పురుగుల నివారణ మాత్రలు అందేలా చూడాలని తెలిపారు. కావున జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల అర్హులైన పిల్లలందరికీ మాత్రలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్ను ఆవిష్కరించారు.




## జూనియర్ డాక్టర్ల సమస్యలకు పరిష్కారం

**స్టైపెండ్ పెంపుపై ఉత్తర్వులు జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

**రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి మంత్రి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపిన నంద్యాల జూనియర్ డాక్టర్లు**






**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 21 ( నంది పత్రిక )** రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు నిరసన తెలుపుతున్న నేపథ్యంలో, వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని రోజుల కిందట నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి నందు ఒక కార్యక్రమానికి విచ్చేసిన గౌరవ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను జూనియర్ డాక్టర్లు కలిసి తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. జూనియర్ డాక్టర్ల వినతికి తక్షణమే స్పందించిన మంత్రి ఫరూక్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి, నారా లోకేష్ దృష్టికి, అలాగే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి చర్చించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం జూనియర్ డాక్టర్లకు స్టైపెండ్ పెంచుతూ అధికారికంగా +.ా.వీం.చీశీ. 141 (ఎవీ&ఖీఔ ణవజూ, ఋవం: 21-09-2026) ఉత్తర్వులను జారీ చేసింది. వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సకాలంలో స్పందించి జీవో జారీ చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రివర్యులు ఎన్.ఎండి. ఫరూక్ కు జూనియర్ డాక్టర్ల సంఘ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం

**జిల్లా అధికారులందరూ అవకాశాన్ని సద్వినియోగం చూసుకోవాలి: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, , సెప్టెంబర్ 21(నంది పత్రిక):-** : ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్ నందు ఉచిత ప్రత్యేక ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. సెప్టెంబర్ 23 వ తేదీన ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయుర్వేద నిపుణులైన వైద్యులు వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేయనున్నారని తెలిపారు. ఈ సదస్సు ద్వారా 1.నాడీ పరీక్ష నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడం.

2.బి.ఎం.డి. (బోన్ మినరల్ దేన్సిటీ ) పరీక్ష ద్వారా ఎముకల సాంద్రతను పరీక్షించడం. ముఖ్యంగా 4050 సంవత్సరాలు పైబడిన వారు ఈ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

3.హెచ్‌బి. (హెచ్బి),

4.ఆర్‌బిఎస్ (ఆర్ బి ఎస్ ) పరీక్షలు

5.ఆరోగ్యకరమైన దినచర్య, సరైన నిద్ర, ఆహార నియమాలు, జీవనశైలిపై నిపుణుల సూచనలు అందించడం.

6.పథ్యఅపథ్య విధానాలపై అవగాహన కల్పించి, ఏ ఆహారం తీసుకోవాలి, ఏ ఆహారానికి దూరంగా ఉండాలనే విషయాలపై సూచనలు ఇవ్వడం.

7.వివిధ ఆరోగ్య సమస్యలకు ఉపయోగపడే లైవ్ యోగా థెరపీ ప్రదర్శన, శిక్షణ.

8.పంచకర్మ చికిత్సా విధానాలపై ప్రత్యక్ష ప్రదర్శన (లైవ్ డిమాంస్ట్రేషన్) నిర్వహించడం. వెన్నునొప్పి, మెడనొప్పి, స్పాండిలైటిస్, ఎక్కువసేపు తప్పు భంగిమలో కూర్చోవడం వల్ల కలిగే సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నిపుణుల సలహాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జిల్లా అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావాలి అన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తమ పిల్లలు, జీవిత భాగస్వామి, తల్లిదండ్రులతో కలిసి సెప్టెంబర్ 23 తేదీన ఉదయం 9 గంటలకు శిబిరానికి హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వైద్య నిపుణుల సలహాలు, అవసరమైన ఉచిత మందులు, ఆహార నియమాలకు సంబంధించిన డైట్ చార్ట్ పొందడంతో పాటు యోగా థెరపీ, పంచకర్మ విధానాలపై అవగాహన పొందాలని అన్నారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా అధికారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com